
ప్రజాశక్తి

ఆదివారం 12 మే 2024 | 8 పేజీలు




తిరుపతి



చిత్తూరు

వీ(వా)ళ్లు మారరంతే..!



ఏ నోట విన్నా...ఇదే ముచ్చట..!

మీకు ఎంత ఇచ్చారు.. వైసిపి మూడువేలు ఇస్తుందంట కదా, టిడిపి కూడా అంతేనంట.. శ్రీకాళహస్తిలో అయితే చీరలు, ముక్కుపుడకలు, మెట్టెలు కూడా అదనంగా ఇస్తున్నారంట.. పలానా చోట ఐదువేలు ఇస్తున్నారంట.. మా ఊరికేమో ఇంతవరకూ రాలేదు. రేపేమన్నా వస్తారేమో చూడాలి.. ఆ ఇచ్చారులే చీరలు వంద రూపాయలు కూడా గిట్టదు.. కొన్నిచోట్ల ఆదివారాలు కిలో చికెన్ ఇచ్చారంట.. రోజూ బిర్యానీ ప్యాకెట్లే.. ఇంట్లో వంట చేసి వారం రోజులయ్యింది.. మీ ఊళ్లో ఎలా ఉంది ట్రెండ్.. వైసిపి గెలుస్తుందా.. టిడిపి గెలుస్తుందా..ఈ వారమంతా ఇదే ముచ్చట..! వామపక్ష నాయకులు మాత్రం ఎక్కడా డబ్బు పంపిణీలో పాలు పంచుకోకుండా, తమకు అధికారం ఇస్తే అభివృద్ధి చేస్తామని, పోరాటాల్లో అండగా ఉంటామని ఓటర్లకు భరోసా ఇస్తున్నారు. ప్రత్యేకించి కొంతమంది మేథావులు, సిపిఎం, సిపిఐ నాయకులు నిక్కచ్చిగా ఓటుకు నోటును తిరస్కరిస్తున్నారు. 'మీ నోటు మాకొద్దు.. మా ఓటు మా ఇష్టం' అని మొహానే చెప్పి డబ్బు పంపిణీ చేసే ఏజెంట్లను తిప్పి పంపించేయడమూ కొన్నిచోట్ల 'ప్రత్యేకంగానే' కనిపించింది.



ఓటు వేయండి.. 'విలువ' కట్టొద్దు..

నానాటికీ పెరుగుతున్న ప్రలోభాల ఖర్చు


రూ.100 కోట్లు చొప్పన ఎన్నికల వ్యయం

అధికారికంగానే రూ.750 కోట్ల తాయిలాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఓటు వజ్రాయుధం..ఒక్క ఓటుతో అవినీతిపై వేటు..నేటి ఓటు రేపటి మన భవిష్యత్తు..అంటూ ఎన్నికల సందర్భానో, లేక జాతీయ ఓటర్ల దినోత్సవం నాడో ఊకదంపుడు నినాదాలు చేసుకోవడం తప్పా..ఆ ఓటుతో అవినీతిపై వేటు వేసింది లేదు. పైగా ఆ ఓటుతోనే ఓటర్లు తమ జీవితాలపై గొడ్డలి పెట్టు వేసుకుంటున్నారు. ఓటును ప్రత్యామ్నాయ రాజకీయవాదులకు, విద్యావంతులకు, నిస్వార్థపరులకు వేయడం మాని, ప్రలోభాలకు లోబడి అవినీతిపరులకు వేస్తుండడంతో ఈ పరిస్థితులను ఓటర్లు కొని

2లో



తిరుమల శ్రీవారిని దర్శించుకున్న నారా చంద్రబాబునాయుడు

శ్రీవారిని దర్శించుకున్న చంద్రబాబు

ప్రజాశక్తి -తిరుమల

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు. సాంప్రదాయ దుస్తుల్లో వైకుంఠం వైపుగా శ్రీవారి ఆలయంలోకి ప్రవేశించి స్వామి వారిని లఘు దర్శనంలో దర్శించుకున్నారు. దర్శనానికి వెళ్లే సమయంలో క్యూ లైన్లలో ఉన్న భక్తుల దగ్గరకు వెళ్లి చంద్రబాబు అభివాదం చేశారు. తిరుమల నుంచి రేణిగుంట ఎయిర్‌పోర్ట్‌కు చంద్రబాబు బయల్దేరి వెళ్లి, అక్కడనుంచి అమరావతికి వెళ్లారు.

నా రెండో సంతకం ల్యాండ్‌యాక్టు పైనే..!

2లో

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



ఆత్మస్తుతి..పరనిందలు..

ముగిసిన ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

సార్వత్రిక, సాధారణ ఎన్నికల ఘట్టం చివరి అంకానికి చేరుకుంది.. దాదాపు 40 రోజులకు పైనే ఎన్నికల ప్రచార ఘట్టం సాగింది. నామినేషన్ల పర్వం ముగిసి ముగియగానే ఏప్రిల్ 18 నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని కూటమిలు, రాజకీయ పార్టీలు, స్వతంత్రులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. నాలుగు ప్రధాన పార్టీలకు చెందిన అధినేతలు జిల్లాలో సుడిగాలి పర్యటనలు చేశారు. ఎన్నికల సభల్లో అభివృద్ధి గురించి చెప్పడం మరిచి, ప్రత్యర్థులపై విమర్శలకే ప్రాధాన్యత ఇచ్చారు. ఎన్నికల ప్రచార శైలిని పరిశీలిస్తే ఆద్యంతం ఆత్మస్తుతి.. పరనిందలుగానే సాగింది.

జిల్లాలో రెండు నెలలకు ముందే ఎన్నికల హడావిడి మొదలైంది. ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయకముందే బూర్జువ పార్టీలకు చెందిన నాయకులు సీట్ల కోసం పైరవీలు ముమ్మరం చేశారు. అందులో కొంత మంది టిక్కెట్ సాధించగా, మరికొంత మందికి రిక్తహస్తం తప్పలేదు. ఆ తర్వాత అసంతృప్తి నేతలను బుజ్జగించడం, మరికొంత మందిని ప్రలోబాలు పెట్టడం, కొంత మందిని బెదిరించడం చేసి, ఎలాగోలా వారిని దారికి తెచ్చుకున్నారు. నామినేషన్ల పర్వం ముగియగానే, రెబల్స్ బెడదను

2లో

ప్రజా'దృష్టి'



తిరుపతి ఎంపి అభ్యర్థి చింతామోహన్ ప్రచారం

2లో

శ్రీవారి భక్తులు దర్శన టోకెన్ చూపాలి

వాట్సాప్ గ్రూపుల్లో రాజకీయ చర్చలు వద్దు

విలేకరుల సమావేశంలో కలెక్టర్, ఎస్పీ

(మొదటి పేజీ తరువాయి)

వీ(వా)ళ్ళు మారరంతే

తెచ్చుకుంటున్నారు. ఐదేళ్లకోసారి జరిగే ఎన్నికల్లో ఓట్లు వేసేందుకు అభ్యర్థుల నుండి మరింతగా ఓటర్లు ప్రలోభాలను ఆశిస్తుండడంతో నానాటికి ఎన్నికల వ్యయం పెరిగిపోతుంది. 2019లో ఒక్కో ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్నికల వ్యయం రూ.50 కోట్లు కాగా నేటి ఎన్నికలకు రూ.100 కోట్ల మార్కు చేరుకుందంటే నాయకులు ఏ స్థాయిలో ప్రలోభ పెడుతున్నారో. ఓటర్లు ఏ స్థాయిలో ప్రలోభ పడుతున్నారో ఇట్టే అవగతమవుతుంది. ఏటేటా పెరుగుతున్న ఎన్నికల ఖర్చుల నేపథ్యంలో ఎమ్మెల్యే గానో, ఎంపీగానో గెలుస్తున్న అభ్యర్థులు అభివద్ధిని మరిచి వచ్చే ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెట్టాలంటే ఎంత వెనకేసుకోవాలనే ఆలోచనలతో ముందుకెళ్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలో అవినీతి కుంభకోణాలకు నాయకులు తెర తీయాల్సి వస్తుందన్న ఆరోపణ ఉంది. దీంతో రాజకీయ నాయకులు ప్రలోభ పెట్టడం మానరు..ఓటర్లు ప్రలోభ పడడం మానరు అంటూ జనాలు చెవులు కొరుక్కుంటున్నారు. జిల్లాలో 18 లక్షలపై చిలుకు ఓటర్లు ఉన్నారు. ఇందులో మెజార్టీగా 15 లక్షల మంది ఓటర్లు ప్రలోభాలకు గురై ఉంటే జిల్లాలోనే అధికారికంగా, బాహాటంగానే 700 కోట్ల రూపాయలు ప్రలోభపెట్టినట్లన్నమాట. అంటే ఒక్కో నియోజకవర్గం వంద కోట్లు ప్రలోభాలకే తెరదీసినట్లు.

రూ.100 కోట్లు దాటిన ఎన్నికల వ్యయం!!

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అధికారిక గణాంకాల ప్రకారం ప్రస్తుతం 2.45లక్షల ఓటర్లు ఉన్నారు. గత ఎన్నికల్లో ఒక్కో అభ్యర్థి తమ ఎన్నికల ఖర్చుతోపాటు ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు సుమారు రూ.50 కోట్లు ఖర్చు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఒక్కో అభ్యర్థి ఎన్నికల ఖర్చు రూ.100 కోట్ల మార్కును తాకేటట్లుగా ఉందని చెప్పుకుంటున్నారు. ఇప్పటికే కొన్ని పార్టీలు ఓటర్లకు చీరలు, ముక్కుపుడకలు పంపిణీ చేసినట్లు సమాచారం. వీటికి తోడు ఒక్కో ఓటుకు రూ.2 నుంచి రూ.3 వేలు చొప్పున ప్రలోభ వ్యయం కింద పంపిణీ చేసినట్లు చెప్పుకుంటున్నారు. ఈ లెక్కన ఒక్క అభ్యర్థి కనీస ఖర్చు రూ.100 కోట్లకు చేరినా ఆశ్చర్యపోనక్కర్లేదని అంతా అనుకుంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో పాలన సాగుతున్నా, అడుగడుగునా అధికారుల నిఘా ఉన్న ఓటర్లను ప్రలోభ పెట్టే ప్రక్రియ మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతోందని విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఓటర్లు ప్రలోభ పడటం మానేదెన్నడు.. అవినీతిపరుల భరతం పట్టేందుకు ఓటును వజ్రాయుధంగా మార్చుకునేది ఎన్నడు.. నిస్వార్థంగా సేవ చేసే ప్రత్యామ్నాయ రాజకీయవాదులు, విద్యావంతులు ప్రజా ప్రతినిధులయ్యేదెన్నడని ప్రతి సామాన్యుడి ప్రశ్నగా మారుతోంది.

(మొదటి పేజీ తరువాయి)

ముగిసిన ఎన్నికల ప్రచారం

దాటేందుకు విత్‌డ్రాలు చేయించేలా పలువురుని మెప్పించారు. ఆ ఘట్టం కూడా పూర్తికాగానే ప్రచారాన్ని ముమ్మరం చేశారు. జిల్లా వ్యాప్తంగా 7అసెంబ్లీ స్థానాలకు, ఒక పార్లమెంట్ స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. 177 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 18, 12, 980 మంది ఓటర్లు ఓటు అనే ఆయుధం ద్వారా అభ్యర్థుల జయపజయాలను నిర్ణయించనున్నారు. శనివారం సాయంత్రంతో ఎన్నికల ప్రచార పర్వం ముగిసింది. గడిచిన వారమంతా ఎన్నికల ప్రచారాలు ముమ్మరంగా జరిగాయి. చివరి సమయంలో పలు ప్రధాన పార్టీల కీలక నేతలు జిల్లాలో ప్రచారం, బహిరంగ సభలు నిర్వహించారు. జనసేన, బిజెపి, టిడిపి కూటమీ నుంచి ఈ నెల 8వ తేది టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తిరుపతిలో భారీ ర్యాలీ నిర్వహించారు. బిజెపి నుంచి ప్రదానమంత్రి నరేంద్రమోడి ఉమ్మడి జిల్లాల తరుపున అన్నమయ్య జిల్లా రాజంపేటలో జరిగిన సభకు హాజరయ్యారు. తిరుపతి రేణిగుంట విమానాశ్రయంలో పలువురు నాయకులతో ముచ్చటించారు. వైఎస్ఆర్‌సిపి తరుపున ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలో పర్యటించి, పలు చోట్ల ఎన్నికల సభలు నిర్వహించారు. శనివారం తిరుపతి కేంద్రంగా బిజెపి జాతీయ అద్యక్షులు నడ్డా ర్యాలీ నిర్వహించారు. ఇండియా కూటమి తరుపున సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.రాఘవులు, మాజీ రాజ్యసభ సభ్యులు పి.మధు, సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తిరుపతిలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. బూర్జువా రాజకీయ పార్టీల నాయకులంతా ప్రజా సమస్యలపై గాని, అభివృద్ధి విషయంపై గాని మాట్లాడకుండా, భవిష్యత్తులో ప్రజలకు ఎలాంటి భరోసా ఇస్తారో చెప్పకుండా ప్రతిపక్షాలపై అధికార పక్షం, అధికార పక్షంపై ప్రతిపక్షాలు విమర్శలకు ప్రాధాన్యత ఇచ్చాయి. సాక్షాత్తు దేశ ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రే ఎన్నికల్లో సభల్లో స్వయంగా పాల్గొన్న వారు చేసిన అభివృద్ధి, చేయబోయే అభివృద్ధి గురించి చెప్పకుండా, ప్రత్యార్థులపై విమర్శలకే ప్రాధాన్యత ఇవ్వడం శోచనీయం. ఇండియా కూటమి అభ్యర్థులు మాత్రం ఇప్పటి వరకు తాము చేసిన పోరాటాలను, ప్రజల కోసం నడిపిన ఉద్యమాలు, తదితర వాటిపై ప్రచారం చేస్తూ, తాము గెలిస్తే భవిష్యత్తులో ఏఏ పనులు చేపడతామో వివరిస్తూ ప్రచారం చేయడం గమనార్హం. ఈ సుదీర్ఘ ప్రచార పర్వంలో గెలుపోటములు ఎవ్వరిని వరిస్తాయో వేచి చూద్దాం.

నా రెండో సంతకం ల్యాండ్‌యాక్టుపైనే..!

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'ప్రజలు మళ్లీ మోసపోయి జగన్‌కు ఓటేస్తే, కర్మకాలి అధికారంలోకి వస్తే మీతాత ముత్తాతలు సంపాదించిన భూమి ఉండదని, కూటమి అధికారంలోకి రాగానే జగన్ ల్యాండ్ గ్రాబింగ్ యాక్టును రద్దు చేస్తా' అని నారా చంద్రబాబునాయుడు అన్నారు. 'ల్యాండ్ చట్టం తెచ్చి, మీ మెడలకు ఉరి వేశారని, రేపు జరగనున్న సంగ్రామంలో ఫ్యానుకు ఉరివేయాలి' అన్నారు. రేపు జరగనున్న ఎన్నికల్లో ఆది, సోమవారాల్లో తాను ఎక్కడికీ పోవడం లేదని, కంట్రోల్ రూమ్‌లో కూర్చుని రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఎన్నికల సరళిని, వైసిపి ఆగడాలను చూస్తుంటానని, ధైర్యంగా ప్రజలు ఓటేసి కూటమిని గెలిపించాలని కోరారు. 'ఈ ఊరు మనదిరా.. ఈ భూమి మనదిరా.. మన పట్టా బుక్‌లో జగన్ ఫొటో ఏంటిరా' అని కూటమి పాటను వినిపించారు. ఎవరి ఫొటోలు లేకుండా రాజముద్రతోనే తాను పట్టాపాసుపుస్తకం ఇస్తానన్నారు. తాను మెగా డిఎస్‌సి తొలిసంతకం. ల్యాండ్ టైటిల్ యాక్టు రెండో సంతకం చేస్తానన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరిరోజు చిత్తూరు మురకంబట్టు జంక్షన్ వద్ద సాయంత్రం 5.50గంటలకు ప్రచారాన్ని ముగించారు. ముగించే ముందు జోరుగా వర్షం పడడంతో కూటమి అధికారంలోకి వస్తుందనడానికి వరుణదేవుడే సాక్షి అని అన్నారు. వర్షంలో తడుస్తూనే కొద్దిసేపు ప్రసంగించాడు. 2024-29లో ఈ రాష్ట్రం అభివృద్ధి పరుగులు తీయడానికి తాను, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఒక విజినరీ తయారు చేశామని, ఐదేళ్లలో ఈ విజిలరీ అద్భుత ఫలితాలు ఇవ్వనుందన్నారు. అమరావతే రాజధానిగా కొనసాగుతుందని, పోలవరం రెండేళ్లలో పూర్తి చేస్తామన్నారు. పోలవరం పూర్తికి కేంద్రంలోని నరేంద్రమోడీ, హోంమంత్రి అమిత్‌షా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. పోలవరం పూర్తి చేసి నదులను అనుసంధానం చేస్తామన్నారు. కుప్పలు తెప్పలుగా పరిశ్రమలు తీసుకొచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పరుగులు తీయిస్తామన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు, మోడీ గ్యారంటీ, ప్రజాగళం హామీలను ఉద్ఘాటించారు. తెలుగుజాతిని ప్రపంచవ్యాప్తంగా నంబర్‌వన్ స్థానంలో తీసుకొస్తామన్నారు. 2029కల్లా అసెంబ్లీలో 33 శాతం మహిళలు ప్రవేశించే దిశగా చట్టం తెస్తామన్నారు. ప్రతి ఏటా జాబ్‌క్యాలెండర్, బిసి డిక్లరేషన్ తీసుకొస్తూ, వారి శ్రేయస్సుకు లక్షా 50వేల కోట్లతో నిధిని ఏర్పాటు చేస్తామన్నారు. రాయలసీమ ప్రాజెక్టుల పూర్తికి జగన్ ఏం చేశాడన్నారు. జగన్‌ను నమ్మొద్దన్నారు. ఈ బహిరంగసభలో చిత్తూరు, పూతలపట్టు ఎంఎల్ఎ అభ్యర్థులు గురజాల జగన్మోహన్‌రావు, డాక్టర్ కె.మురళి మోహన్, టిడిపి ఎంపి అభ్యర్థి దుగ్గుమళ్ల ప్రసాద్‌రావు, మాజీ ఎంఎల్‌సి దొరబాబు, జిల్లా అధ్యక్షులు సిఆర్ రాజన్ పాల్గొన్నారు.

చిత్తూరు ఎన్నికల సభలో చంద్రబాబు



తిరుపతిలో ఐటి సెక్టార్ డెవలప్ చేస్తాం

ప్రజాశక్తి - తిరుపతి

తిరుపతిలో ఐటి సెక్టార్‌ను డెవలప్ చేస్తామని బిజెపి జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా వ్యాఖ్యానించారు. నరేంద్రమోడీతోనే దేశంలో గరీబ్ కల్యాణ్ సాధ్యమన్నారు. తిరుపతి మహాత్మా జ్యోతిరావుపూలె విగ్రహం నుంచి నాలుగుకాళ్ల మండపం వరకూ రోడ్డుషో, ర్యాలీ నిర్వహించారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబులతో కలిసి రోడ్డుషోలో పాల్గొన్నారు. జేపీ నడ్డా మాట్లాడుతూ వికసిత భారత్‌లో యువత, మహిళలు, రైతులు, ప్రజలు, కార్మికులు, శ్రామికులు స్వశక్తితో అన్ని రంగాల్లోనూ పురోగమిస్తున్నారన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుపతినీ స్మార్ట్ సిటీగా మార్చామని పేర్కొన్నారు. హైవేస్, ఇంటర్నెట్, రైల్వేస్, ఎయిర్పోర్ట్ లను అభివద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని ల్యాండ్ సాండ్ మాఫియాలకు బ్రాండ్ గా మారిందని విమర్శించారు. తిరుపతిలో ఐటీ సెక్టర్ ను అభివద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను తప్పకుండా గెలిపించుకోవాలన్నారు. తిరుపతిలో బిజెపి పార్లమెంట్ అభ్యర్థి వరప్రసాద్ , జనసేన అసెంబ్లీ అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మాట్లాడుతూ రాయలసీమకు పట్టిన క్యాన్సర్ గడ్డ జగన్ అని అన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక కొత్త పరిశ్రమలు రాకపోగా, ఉన్నవాటిని పక్క రాష్ట్రాలకు తరిమేశారన్నారు. అమరరాజా కంపెనీపై తీవ్ర వేధింపులకు పాల్పడడంతో పక్క రాష్ట్రంలో ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. మోడీ ప్రధానిగా ఉన్నప్పుడు తాను పంచాయితీరాజ్, ఐటీ శాఖ మంత్రిగా చేశాననీ ఆ సమయంలో ఫాక్స్ కాన్, సెల్ కాన్, టీసీఎస్, జోహో లాంటి అనేక పరిశ్రమలు తీసుకు వచ్చి ఒక లక్ష్యంతో పనిచేశామన్నారు. తిరుపతిలో ఎక్కడ చూసినా భూకబ్జాలు, దందాలేనని, భూమన కుటుంబానికి డబ్బులు ఇస్తేగాని ఇక్కడ పని జరగని పరిస్థితి ఏర్పడిందన్నారు. పొరపాటున చిన్న దొంగకు ఓటేస్తే తిరుమలనూ అమ్మేస్తాడంటూ వైసీపీ అభ్యర్థి భూమన అభినయ రెడ్డినీ విమర్శించారు. గతంలో ఇసుక ధర రూ.వెయ్యి ఉండేదని , ఇప్పుడేమో రూ.5వేలు చేశారనీ, గతంలో క్వార్టర్ బాటిల్ ధర రూ.60 ఉంటే ఇప్పుడు రూ.180 చేసిన ఘనత వైసీపీకే దక్కిందంటూ దుయ్యబట్టారు. జనసేన రాష్ట్రప్రధాన కార్యదర్శి నాగబాబు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజా ప్రయోజనాల రీత్యా కూటమిగా ఏర్పడ్డ బిజెపి, టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రాక్షస పాలనను అంతమొందించాలన్నారు. రోడ్ షోలో తిరుపతి పార్లమెంటు బిజెపి అభ్యర్థి వరప్రసాద్, అసెంబ్లీ జనసేన అభ్యర్థి ఆరని శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ పాల్గొన్నారు. ఈ రోడ్ షో అనంతరం తిరుపతి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ప్రసన్న కుమార్ రెడ్డి బిజెపిలో చేరగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించడం కొసమెరుపు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి జిల్లా పరిధిలో మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను చేశామని, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్పీ కష్ణ కాంత్ పటేల్ స్పష్టం చేశారు. శనివారం జిల్లా కలక్టరేట్ లోని సార్వత్రిక ఎన్నికల మీడియా కేంద్రం లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా కేంద్ర ఎన్నికల సంఘం సమస్యాత్మక నియోజకవర్గాల పరిధిలో వెబ్ కాస్టింగ్ నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా పరిధిలో 2800 కెమెరాలను ఎన్నికల విధులు కోసం వినియోగిస్తున్నామన్నారు. ఒక్క చంద్రగిరి నియోజకవర్గానికి 700 కెమెరాలు, 500 పై చిలుకు తిరుపతి నియోజకవర్గానికి వినియోగిస్తున్నామన్నారు. 13న పోలింగ్ కేంద్రాలకు ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకునేలా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను చేసిందన్నారు. ఎన్నికల విధులకు కేటాయించబడిన ఉద్యోగులు ఆదివారం ఉదయం ఏడున్నర గంటలకు తమకు కేటాయించిన విధులకు సంబంధించి ముందస్తు హాజరు కావాలన్నారు.

శ్రీవారి భక్తులు టోకెన్లు చూపాలి...

తిరుపతి నియోజకవర్గ పరిధిలో మే 13న జరిగే పోలింగ్ రోజున తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చి తిరుపతిలో బసచేస్తూ ఉంటే దర్శన టోకెన్లు తప్పనిసరిగా చూపాల్సి ఉంటుందన్నారు. బయట వ్యక్తులు తిరుపతిలో ఉండరాదన్నారు. వాట్సాప్ గ్రూపులలో శనివారంతో ప్రచారం ముగిశాక ఎటువంటి రాజకీయ చర్చలు జరపరాదని, సామాజిక మాధ్యమాలపై నిఘా ఉంచామన్నారు. శనివారం 6 గంటల తరువాత ప్రచారం ఎట్టి పరిస్థితుల్లో ఏ రాజకీయ పార్టీకి సంబంధించిన వారు చేయరాదన్నారు. ఏదేని అవాంఛనీయ ఘటన జరిగితే రిజర్వు బలగాలు 15 నిమిషాలలో ఘటన స్థలానికి చేరుకుంటాయని ఎస్పీ కష్ణ కాంత్ పటేల్ స్పష్టం చేశారు. ఎన్నికల సరళని దెబ్బతీయాలని ప్రయత్నాలు చేస్తే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు.

పోలింగ్ సిబ్బంది హాజరు తప్పనిసరి

పోలింగ్ సిబ్బంది మూడవ దఫా ర్యాండమైజేషన్, మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ ప్రక్రియ ఈసిఐ నిర్దేశిత వెబ్సైట్ నందు సార్వత్రిక ఎన్నికలు 2024 సాధారణ పరిశీలకులు ఉజ్వల్ కుమార్ ఘోష్, కే.జ్యోతి (వర్చువల్ గా హాజరయ్యారు) సమక్షంలో , గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థుల సమక్షంలో పకడ్బందీగా పూర్తి అయిందని ఎన్నికల అధికారి తెలిపారు. ఎన్నికల పోలింగ్ విధులు కేటాయించబడిన పోలింగ్ సిబ్బంది వారికి కేటాయించబడిన నియోజక వర్గ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఆదివారం ఉదయం 7.30 గంటలకు తప్పక హాజరు కావాలని, ఎలాంటి మినహాయింపు లేదని, హాజరు కాని పక్షంలో ఎన్నికల నిబంధనల మేరకు క్రమ శిక్షణ చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

అసెంబ్లీకి సంబంధించిన ఏడు నియోజకవర్గాలకు, తిరుపతి పార్లమెంటు నియోజక వర్గానికి సంబంధించిన ప్రిసైడింగ్ అధికారులు 2430, సహాయ ప్రిసైడింగ్ అధికారులు 2444, ఇతర పోలింగ్ సిబ్బంది 9895 మంది రిజర్వ్ తో మొత్తం కలిపి 14769 మందిని, మైక్రో అబ్జర్వర్లు 1036 మంది రిజర్వ్ తో కలిపి వారి వివరాలను సాప్ట్ వేర్ నందు ఆన్లైన్ ద్వారా ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టి పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. డిఆర్ ఓ పెంచల కిషోర్, మ్యాన్ పవర్ మేనేజ్మెంట్ నోడల్ అధికారి చంద్రశేఖర్ నాయుడు, ఐ.టి నోడల్ అధికారి వేంకటేశ్వర రావు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

జిల్లాలో స్వేచ్ఛాయుత వాతావరణంలో, నిష్పాక్షిక పారదర్శకంగా సాధారణ ఎన్నికలు జరిగేందుకు, ఓటర్లు ప్రశాంతంగా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ,ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు నడుచుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ కోరారు. పోలింగ్ ముగిసిన తర్వాత 7 అసెంబ్లీ నియోజకవర్గాల నుండి పోల్డ్ ఈవీఎంలు మే 13న లేదా మే 14న శ్రీ పద్మావతి మహిళ యూనివర్సిటీ నందు ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్ నందు సాధారణ పరిశీలకుల, రిటర్నింగ్ అధికారుల, రాజకీయ పార్టీల, అభ్యర్థుల సమక్షంలో భద్రపరచడం జరుగుతుందన్నారు.

స్వేచ్ఛగా ఓటు వినియోగించుకోండి: ఎస్ఐ

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: ప్రజలందరూ స్వేచ్ఛగా ఓటు వినియోగించుకోవాలని ఎస్ఆర్ పురం ఎస్ఐ రాజా కుల్లాయప్ప తెలిపారు. శనివారం మండలంలోని కొత్తపల్లి పంచాయతీ తమిళనాడులోని నాగపట్నం, మైలాపూడి మావట్టం పోలీస్ బలగాలతో ప్రధాన మార్గాలలో కవాతు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ప్రజలందరూ స్వేచ్ఛగా నిర్భయంగా ఓటు వినియోగించుకొనేలా అన్ని విధాలా చర్యలు చేపట్టినట్లు స్పష్టం చేశారు.

వైసిపి నుండి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నింద్ర మండలం ఇరుగువాయిలో 25 మంది యువకులు వైసిపి నుంచి టిడిపిలో చేరారు. వీరికి నగరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ టిడిపి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గాలి భాను ప్రకాష్ మాట్లాడుతూ అందరూ ఐక్యంగా పనిచేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. అధికారం సాధిస్తే గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయవచ్చని తెలిపారు.

పోలింగ్ కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలంలోని యుఎం పురం పోలింగ్ కేంద్రాన్ని శనివారం తహశీల్దార్ ధోని ఆల్ఫ్రెడ్ తనిఖీ చేశారు. పోలింగ్ స్టేషన్‌లో మౌలిక వసతులు, అక్కడి ఏర్పాట్లును పరిశీలించారు. తాగునీరు, కరెంటు, వెలుతురు వంటి సౌకర్యాలను ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

పోలీసుల కవాతు

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటింగ్‌లో పాల్గొనడానికి వారిలో ఆత్మస్థైర్యం నింపడానికి శనివారం కేంద్ర బలగాలు గంగాధర నెల్లూరు మండలం తూగుండ్రంలో కవాతు నిర్వహించారు. స్వేచ్ఛ వాతావరణంలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవడం కోసం వారిలో ధైర్యం నిర్వహించడానికి ఇలాంటి కవాతులు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రెడ్డెప్ప, పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపితోనే మైనార్టీలు: సయ్యద్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ముస్లిం మైనారిటీలంతా ఎల్లప్పుడూ వైసీపీతోనే ఉంటామని చిత్తూరు జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు, 31వ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ సయ్యద్ తెలిపారు. శనివారం చిత్తూరులో ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ఎన్నికల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా విజయానందరెడ్డిని, ఎంపీ అభ్యర్థిగా రెడ్డప్పను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ముస్లింలు క్రిస్టియన్లు బీసీలు మైనార్టీలు నియోజకవర్గ ప్రజలు గెలిపించాలని కోరారు. ఎన్డీఏ కూటమి మత విద్వేషాలను రెచ్చగొట్టి అధికారం చేపట్టడానికి చూస్తోందన్నారు. చిత్తూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఎంపీ అభ్యర్థులకు మైనార్టీలు అండగా ఉంటామన్నారు. ఈ సమావేశంలో నాయకులు సీనియర్ ప్రకాష్, రషీద్ భాయ్, సయ్యద్ బాషా, మస్తాన్, ఆసిఫ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వేసవి సంస్కృత శిక్షణ

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని రాష్ట్రీయ సంస్కృత విశ్వ విద్యాలయంలో ఈ నెల 15వ తేదీ నుండి 26వ తేదీ వరకు చిన్న పిల్లలకు, పెద్దలకు సంస్కృతం నేర్పించే వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఎల్‌కేజీ నుండి ఏడవ తరగతి, 4 సంవత్సరాల నుండి 13 సంవత్సరాల వరకు వయస్సు గల పిల్లలకు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు బాలనందనం అనే పేరుతో సంస్కృత సంభాషణ, శ్లోకాలు, సంస్కృత పాటలు మొదలైన విషయాలను నేర్పిస్తారు. 13 సంవత్సరాలు పైబడిన వాళ్లందరికీ సాయంత్రం 5.30 నుండి 7.30 వరకు సంస్కృత సంభాషణ తరగ తులను నిర్వహిస్తారు. సంస్కృత భారతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఈ తరగతులను నిర్వహిస్తున్నాయి. ఆసక్తి కలిగిన వారు కింది నెంబర్లకు ఫోనుద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. నెంబర్లను 8367476975, 9441316319 సంప్రదించాలని కోరారు.

ప్రత్యేక నిఘానేత్రంతో ఎన్నికల ఏర్పాట్లు

-72 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు

ప్రజాశక్తి- సత్యవేడు: సత్యవేడు నియోజకవర్గ పరిధిలో సోమవారం నిర్వహించే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు ఏర్పాట్లు శర వేగంగా సాగుతున్నాయి.

నియోజకవర్గం పరిధిలో 279 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో 72 కేంద్రాలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు

సిబ్బంది, ఇతర సిబ్బంది చర్యలు

నియోజవర్గ పరిధిలోని సత్యవేడు, వరదయ్య పాలెం, బుచ్చినాయుడు కండ్రిగ, నాగలాపురం, పిచ్చాటూరు, కేవీబీపురం నారాయణవనం మండలాలు ఉన్నాయి. ఎన్నికల నిర్వహణకు మొత్తం 335 మంది పిఓలు, 330 మంది ఏపీవోలు, 1340 మంది ఓ పిఎస్‌లను నియమించారని అధికారులు పేర్కొన్నారు. 72 మంది మైక్రో అబ్జర్వర్స్, 139 చోట్ల, వెబ్ కాస్టింగ్,120 వీడియో కెమెరాల ద్వారా పోలింగ్ సరళి నమోదు చేయనున్నారు.

రెండు చోట్ల మోడల్ పోలింగ్ కేంద్రాలు

సత్యవేడు నియోజకవర్గంలో రెండుచోట్ల మహిళా మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. సత్యవేడు పట్టణంలో పోలీస్ స్టేషన్ నెంబర్ 259, బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో ఒకచోట మోడల్ పోలింగ్ స్టేషన్ అందుబాటులోకి తీసుకొచ్చారు.

చరిత్రలో నిలిచిపోయేలా అభివృద్ధి చేశాం: ప్రతిభా గాంధీ


ప్రచారం నిర్వహిస్తున్న ప్రతిభా గాంధీ

ప్రజాశక్తి-కార్వేటినగరం: చరిత్రలో నిలిచిపోయేలా రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి చేసిందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుమార్తె ప్రతిభా గాంధీ అన్నారు. శనివారం మేజర్ పంచాయతీ కార్వేటినగరం దళితవాడలో ఎంపీపీ లతబాలాజీ, సర్పంచ్ ధనంజయవర్మ, ఉప సర్పంచ్ శాంతి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళపాలనలో సీఎం జగనన్న చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి చరిత్రలో నిలిచిపోవడం ఖాయమన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలు అందించి అభివృద్ధి చేసి చూపించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. అనంతరం ఎంపీపీ లత మాట్లాడుతూ ప్రతి నెల 1వ తేదీన తెల్లవారు జామున తలుపు తట్టి పింఛన్లు అందించిన ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమని చెప్పారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి, ఎంపీ అభ్యర్థి రెడ్డెప్పను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో శేషాద్రి, దొరబాబు, కట్ల రవి పాల్గొన్నారు.

'అమ్మంటే తెలుసుకో.. జన్మంతా కొలుచుకో..'



ప్రజాశక్తి - క్యాంపస్ : 'అమ్మ..!' ఆ పదంలో ఆప్యాయత, అనురాగం, ఆనందం, ఆత్మీయత, ఆదర్శం, కమ్మదనం, తీయదనం, ఇంకా ఎన్నోన్నో... ఎంత చెప్పినా తక్కువే... మాట లకు అందనిది అమ్మ ప్రేమ అని ఆర్.కేస్ వీక్ష ద స్కూల్ సంస్థ డైరెక్టర్ ఆర్కే విమలారెడ్డి తెలిపారు. స్థానిక బైరాగిపట్టెడ ఆర్.కేస్ వీక్ష ద స్కూలులో శనివారం ఉదయం మాతృదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం తల్లికి వందనం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కేస్ వీక్ష ద స్కూల్ అధినేత డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ అమ్మే బ్రహ్మను సృష్టించింది, అమ్మ లేనిదే బ్రహ్మ ఎక్కడి నుంచి పుట్టాడు? మన భారతీయ సమాజం సైతం మాతృదేవోభవ, పితృదేవోభవ అంటూ అమ్మకే అగ్రతాంబూలం ఇచ్చింది. ఏ దేశంలోనైనా సంస్కృతాలు మారవచ్చు. కానీ అమ్మ ప్రేమ మారదని తెలిపారు. అమ్మ లాలి పాటకు మించిన సంగీత విద్వాంసుడు, అమ్మలా పాడి నిద్ర పుచ్చగల సంగీత కళాకారుడు లేడు. అందుకే అమ్మ సంగీత కళానిధి. సంగీత, సాహిత్యపరంగా మాధుర్య పరంగా అమ్మ లాలిపాటకు మించిన పాట లేనే లేదు అని అన్నమయ్య నృత్య కళామండలి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్రీరామ్ తెలిపారు. తల్లికి వందనం లో విద్యార్థిని విద్యార్థులు వారి తల్లులకు పాద పూజలు చేసి, తల్లి ఆశీర్వచనం తీసుకున్నారు. భూమాత అంత సహనంతో తల్లులందరూ తమ బిడ్డల భవిష్యత్ బాగుండాలని ఆశీర్వాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం పుష్ప, కల్పన, నదియ, ప్రేమావతి, అరుణ, అనూష, అంజప్ప పాల్గొన్నారు.

వైసిపి హామీలు నమ్మొద్దు

- టీడీపి రాష్ట్ర కార్యదర్శి కనుమూరు హరిచంద్రారెడ్డి



మాట్లాడుతున్న హరిచంద్రరెడ్డి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఆచరణ సాధ్యం కానీ హామీలు ఇస్తున్న వైసిపి నాయకులను నమ్మవద్దని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కనుమూరు హరిచంద్ర రెడ్డి పట్టణ ప్రజలకు పిలుపు నిచ్చారు. గూడూరు పట్టణంలోని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కనుమూరు హరిచంద్రా రెడ్డి నివాసంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిచంద్రారెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో సుమారు 15 వేల కోట్ల రూపాయల రేషన్ బియ్యం స్కాం జరిగిందని ఆరోపించారు. రాబోయే ప్రభుత్వం ఆ స్కాంకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గూడూరు పట్టణ అభివృద్ధి పై వైసీపీ నాయకులకు చిత్తశుద్ధి లేదని వైసీపీ పాలనలో చేసిన పనుల్లో జరిగిన అవినీతిని వచ్చే ప్రభుత్వం వెలు గులోకి తెస్తుందన్నారు. వైసీపీ నాయకులు ఓట్లు కొనుగోలుకు అవినీతి సొమ్మును పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ప్రజలు ఆ డబ్బులను తీసుకొని అభివృద్ధికి పాటుపడే టిడిపి ప్రభుత్వం ఏర్పాటుకు అండగా నిలవాలని పట్టణ ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి..

- వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రానున్న ఎన్నికల్లో బొజ్జల సుధీర్ రెడ్డిని గెలిపిస్తే హైదరాబాదు నుంచి పరిపాలిస్తాడని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బియ్యపు మధుసూదన్ రెడ్డిని గెలిస్తే నిరంతరం శ్రీకాళహస్తిలోనే ఉంటూ 108లా సేవలు చేస్తాడని, నియోజకవర్గ ప్రజలు ఎవరిని గెలిపించుకోవాలో తెల్చుకోవాలని స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైసీపీ క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన మీడియా ముఖంగా నియోజకవర్గ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా వున్న మూడేళ్ల పాలన(కోవిడ్ రెండేళ్ల కాలాన్ని మినహాయించి) సాగిందన్నారు. బొజ్జల కుటుంబం 30 ఏళ్లలో చేయలేని అభివృద్ధిని తాను రెండేళ్లలోనే చేశానని తెలిపారు. ముఖ్యంగా శ్రీకాళహస్తి క్షేత్ర ప్రాశస్త్యాన్ని తెలిపేలా స్వర్ణముఖి నది, కరకట్ట సుందరీకరణకు నడుం కట్టానన్నారు. పట్టణంలో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా భూగర్భ విద్యుత్ లైన్లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. బియ్యపు మధుసూదన్ రెడ్డి పేరు శ్రీకాళహస్తి చరిత్రలో నిలిచిపోయేలా స్వర్ణముఖి నదిలో డ్యామ్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. రైతులు, విద్యార్థులు, చిరు వ్యాపారుల కోసం నా సొంత నిధులు కొన్ని కోట్లు ఖర్చు చేశానని గుర్తు చేశారు. పేదల వైద్యానికి, పేదల అంత్యక్రియలకు, ముస్లిం మైనార్టీల వివాహాలకూ తన సొంత నిధులు ఖర్చు పెట్టానని చెప్పు కొచ్చారు. ముఖ్యంగా కరోనా సమయంలో ప్రాణాలు ఫణంగా పెట్టి తాను, తన బిడ్డలు పేదలకు సేవ చేసామన్నారు. నిత్యావసర సరుకులు, మాస్కులు, మందులు, శానిటైజర్ల కొనుగోలుకు సొంత సొమ్ము ను ఖర్చు చేశానన్నారు. అయితే ఆ సమయంలో బొజ్జల సుధీర్ రెడ్డి ఎక్కడ ఉన్నాడో చెప్పాలని సవాలు విసిరారు. ప్రజల్ని, కార్యకర్తలని గాలికొదిలి హైదరా బాదు లోని విలాసవంతమైన భవనంలో హాయిగా చికెన్ వండుకుని తిన్నాడని విమర్శించారు.



ఈ ఐదేళ్లలో ప్రజల ముఖం చూడని సుధీర్ రెడ్డి గత ఆరు నెలలుగా శ్రీకాళహస్తిలో మకాం వేసి ఎన్నికల డ్రామాలు వేస్తున్నాడని మండి పడ్డారు. నియోజకవర్గ ప్రజలకు ఆయన ఈ ఐదేళ్ల సొంత నిధులు ఖర్చు పెట్టారో చూసించాలని కోరారు. ఆయనను నమ్మొద్దని సూచించారు. నమ్మి ఓట్లేస్తే హైదరాబాదుకు వెళ్లి కూర్చుంటా డని విమర్శించారు.తాను ఇక్కడే పుట్టి, పెరిగి ఇక్కడే పాలన సాగి స్తున్నానని మీకు నాన్ లోకల్ లీడర్ కావాలో లేకుంటే నిత్యం 108లా ప్రజలకు అందుబాటులో ఉండే బియ్యపు మధు కావాలో ప్రజలు తేల్చుకోవాలని హితవు పలికారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే పెండింగ్ ప్రాజెక్టులన్నిటినీ పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధిని చూసి ఓట్లేయాలని ప్రజల్ని కోరారు.

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని పేరుమాళ్ళపల్లికి చెందిన గజేంద్రరెడ్డి, తులసిరెడ్డి, మజీ ఎంపీటీసీ మునిరత్నం మునిరాజా శనివారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి థామస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. నాయకులు మోహన్ మురళి, చెంగల్‌రాయులురెడ్డి, రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: మండలంలోని కొత్తపల్లి మిట్టలో శనివారం టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. కొత్తపల్లి యోగిశ్వర్ నాయుడు, కొత్తపల్లి మిట్ట యువత, నాయకులు ప్రవీణ్, సతీష్, నవీన్ రెడ్డి, మహేంద్ర పాల్గొన్నారు.

వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-తవణంపల్లి: మండలంలోని అరగొండ పంచాయతీలో వైసీపీ నాయకులు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా అరగొండ కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆ తరువాత ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసీ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్, ఎంపీ అభ్యర్థి రెడ్డెప్పను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

సదుం ఎస్ఐగా షేక్షావలి

ప్రజాశక్తి-సదుం: సదుం ఎస్ఐగా షేక్షావలి శనివారం బాధ్యతలు తీసుకొన్నారు. ఇక్కడ పని చేసిన ఎస్ఐ మారుతిని రాష్ట్ర ఎన్నికల అధికారి బదలీ చేయడంతో, చిత్తూరు జిల్లా ఎస్పి మణికంఠ అదేశాలు మేరకు చిత్తూరు ఒన్ టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి బదలీపై సదుం పోలీస్‌స్టేషన్‌లో శనివారం బాధ్యతలు తీసుకొన్నట్లు ఆయన తెలిపారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్‌వి యూనివర్సిటీ ప్రొఫెసర్లు

ఇన్‌స్టా ఫిజిక్స్ ప్రత్యేక పరీక్షల పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్ : ఐఐటీ, నీట్ అడ్వాన్స్, మెయిన్స్ పరీక్షలకు ప్రిపేరయ్యే విద్యార్థుల కోసం ఇన్ స్టా ఫిజిక్స్ ప్రత్యేక పరీక్షల పుస్తకాన్ని ఎస్వీ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగ ప్రొఫెసర్ బి.దేవప్రసాద్ రాజు ఆవిష్కరించారు. ఇందుకు సంబంధించిన ఆవిష్కరణ కార్యక్రమం ఎస్వీయూలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ దేవప్రసాద్ రాజు మాట్లాడుతూ ఫిజిక్స్‌కు సంబంధించిన అత్యంత క్లిష్టమైన అంశాలు ఈ పుస్తకం అత్యంత వివరణాత్మకంగా తెలుపుతుందన్నారు. పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడానికి ఈ పుస్తకం ఉపయోగపడుతుందని తెలిపారు. ఫిజిక్స్ నిపుణులు ఆశోక్ కుమార్ మాట్లాడుతూ ఈ పుస్తకం చదివితే ఫిజిక్స్‌కు సంబంధించిన సమగ్ర అవగాహన ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కుసుమ హరనాథ్, ప్రొఫెసర్ కుమారస్వామి, ప్రొఫెసర్ ఉమామహేశ్వర రెడ్డి, డాక్టర్ విజయశేఖర్, పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
చిత్తూరు - తిరుపతి
ఆదివారం 12
మే 2024



సార్వత్రిక రణభేరి

అభివృద్ధి చేశాం.. గెలిపించండి: వెంకటేగౌడ


ఎన్నికల ప్రచారంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ


ప్రజాశక్తి-వికోట: ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎంతో అభివృద్ధి చేశామని, మరో సారి ఆదరించి సీఎం వైఎస్ జగన్‌ను గెలిపించాలని పలమనేరు ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ కోరారు. శనివారం వికోటలో జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులతో కలిసి ఎన్నికల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేగౌడ మాట్లాడుతూ గతంలో వైసీపీ తరపున గెలిచి టీడీపీలో చేరిన నాయకుడు నియోజకవర్గంలో అభివృద్ధి ఏం చేశాడని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి పరుగులు పెట్టిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. పలు సంక్షేమ పథకాలు అమలు చేసి నగదును పారదర్శకంగా నేరుగా పేదల ఖాతాలో జమ చేశారన్నారు. సచివాలయం, వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి ప్రజలకు సుపరిపాలన అందించారన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు అవసరాలకు వివిధ పార్టీలతో పొత్తులు పెట్టుకొనే నిజస్వరూపాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. అభివృద్ధి మరింత జరగాలన్నా.. సంక్షేమ ఫలాలు కొనసాగాలన్నా మరో సారి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. ప్రజలంతా ఆలోచన చేసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వైసీపీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎంపీ అభ్యర్థి రెడ్డెప్పను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా జెడ్పీ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుభాష్ చంద్రబోస్, ఎంపీపీ యువరాజ్, బాలగుర్నాథ్, పిఎన్ నాగరాజ్, గణేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నాపై ఆరోపణలు తగదు: థామస్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్

ప్రజాశక్తి-వెదురుకుప్పం: తనపై నిందారోపణలు చేయడం డిప్యూటీ సీఎం నారాయణస్వామికి తగదు అని టీడీపీ జీడీ నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ అన్నారు. శనివారం కార్వేటినగరం మండలం అల్లాగుంటలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పేదల నుంచి అక్రమంగా డబ్బులు వసూళు చేస్తున్నట్లు ఆరోపించడం సబబు కాదన్నారు. కార్వేటినగరం వేణుగోపాలస్వామి ఆలయంలో తాను ప్రమాణానికి సిద్ధం అని నారాయణస్వామికి సవాలు విసిరారు. తనపై నారాయణస్వామి చేసిన ఆరోపణలు రుజువు చేయలేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని థామస్ హెచ్చరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చెంగల్‌రాయ యాదవ్, రాజశేఖర్, మకోవ, డానియల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఏమి మేలు చేశావో చెప్పు థామస్: నారాయణస్వామి


మీడియాతో మట్లాడుతున్న నారాయణస్వామి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: టీడీపీ జీడీ నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ నియోజకవర్గ ప్రజలకు ఏమి మేలు చేశాడో చెప్పాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి ప్రశ్నించారు. శనివారం పుత్తూరులో ఆయన నివాసంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. టీడీపీ అభ్యర్థి డాక్టర్ థామస్‌కు అంబేద్కర్ భావాలు అంటే ఏంటో తెలుసా అన్నారు. డాక్టర్‌గా వైద్యం పేరిట పేద ప్రజల నుంచి డబ్బులు తీసుకొన్నాడని ఆరోపించారు. తాను నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిని చూసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో సారి తన కుమార్తెకు టికెట్ ఇచ్చాడని తెలిపారు. నిజాలు తెలుసుకొని మాట్లాడకుంటే తగిన గుణపాఠం చెబుతామని డాక్టర్ థామస్‌ని నారాయణస్వామి హెచ్చరించారు.

ప్రజాస్వామ్యపు పండగ..

- తప్పక ఓటు వేయాలని ఏఆర్వో, కమిషనర్ డాక్టర్ అరుణ పిలుపు
- నగరపాలక ఆధ్వర్యంలో నగరంలో భారీ స్కూటర్ ర్యాలీ



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: భారతదేశ ప్రజాస్వామ్యపు పండుగలో ఓటర్లంతా తరలివచ్చి ఓటు వేయాలని చిత్తూరు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, కమిషనర్ డాక్టర్ జె.అరుణ పిలుపునిచ్చారు. స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా ఓటర్లంతా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరుతూ చిత్తూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉదయం నగరంలో భారీ స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. నగరపాలక కార్యాలయంలో ర్యాలీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఏఆర్వో, కమిషనర్ డాక్టర్ అరుణ మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్క ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా ఇప్పటికే అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, మే 13న (సోమవారం) జరిగే ఎన్నికల్లో వీలైనంత ఎక్కువ పోలింగ్ శాతం నమోదయ్యేలా క్షేత్రస్థాయిలో చైతన్యం తేవాలన్నారు. గత ఎన్నికల్లో అర్బన్ ప్రాంతంలో పోలింగ్ శాతం తక్కువ ఉందని.. ఈ ఎన్నికల్లో గరిష్ట స్థాయిలో పోలింగ్ శాతం నమోదు అయ్యేలా ఓటర్లు ముందుకు వచ్చి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ స్వయంగా ద్విచక్ర వాహనాన్ని నడుపుతూ ర్యాలీని ముందుకు నడిపించారు. ఓటు హక్కు ఆవశ్యకత, ప్రాధాన్యతలను వివరిస్తూ, ప్లకార్డులు ప్రదర్శిస్తూ నగరపాలక ఉద్యోగులు, వార్డు కార్యదర్శులు నగరంలో మహవీర్ వంతెన మీదుగా గాంధీ కూడలి, ఎమ్మెస్సార్ సర్కిల్, దర్గా సర్కిల్, గిరింపేట సర్కిల్ నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వార్డు సచివాలయాల పరిధిలో స్థానిక వార్డు కార్యదర్శులు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ఎంహెచ్‌వో డా.అనిల్ కుమార్ నాయక్, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహ, నగరపాలక ఉద్యోగులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

దౌర్జన్యాలకు ఇక అంతం పలకాలి: రామచంద్రాయాదవ్




ప్రజాశక్తి-పుంగనూరు: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బెదిరింపులకు నా పంచి మీద అంచు కూడా భయపడదూ అని బీసీవై పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ తీవ్రగా వ్యాఖ్యలు చేశారు. భారతీయ చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో పుంగనూరు నుంచి రొంపిచర్ల వరకు శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రచారం ముగింపు ఆఖరి రోజున పుంగనూరు మున్సిపాలిటీ పరిధిలోని నగరి నుండి బోడె రామచంద్ర యాదవ్ భారీ ర్యాలీ వాహనాలతో పట్టణ పురవీధుల గుండ ప్రదర్శన నిర్వహించి రొంపిచర్లలో ర్యాలీని ముగింపు చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం ప్రగతి కోసం అరాచకాలు, రౌడీయిజం, దౌర్జన్యం అంతం పలకాలని పిలుపునిచ్చారు. మార్పు దిశగా, పుంగనూరు నియోజకవర్గంలో అభివృద్ధి దిశగా, ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అన్ని రకాల ఇక్కడ వైసీపీ, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తనను ఇబ్బందులు పెట్టారని మాపై దాడులు దౌర్జన్యాలు చేపించారని అయినా వీటన్నింటికి బెదిరే వ్యక్తిని కాదన్నారు. చివరికి ఎన్నికల సమయంలో కూడా నాపై తప్పుడు కేసులు పెట్టించారని కేడర్ను కార్యకర్తలను చల్లా చెదురు చేయించారన్నారు. వీరి అరాచకాలకు ఎప్పుడు తాను వెనుకడుగు వేయలేదు అన్నారు. నియోజకవర్గంలో ప్రజల ఓటు భవిష్యత్తుకు పునాది కావాలని అభివృద్ధి దిశగా మార్పు రావాలని అభివృద్ధికి శ్రీకారం చుడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు అవకాశం కల్పించి చెరుకు, రైతు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చనకంటి సాంబమూర్తి పాల్గొన్నారు.

ప్రచారానికి తెర.. తాయిలాలతో ఎర!

ప్రజాశక్తి-డక్కిలి:

ఎన్నికల పర్వం ఆఖరి అంకానికి చేరింది. ప్రచారం ముగిసింది.. ప్రధాన పార్టీలు ప్రలోభాలకు తెరలేపారు. ఈ రోజు రాత్రి గడిస్తే చాలు ఇక ఎన్నికలే. ఇలాంటి కీలక సమయంలో.. నమ్మకు నమ్మకు ఈ రేయిని.. అంటూ ప్రధాన పార్టీ అభ్యర్థులు, అనుచరులు వ్యూహాత్మక ఎత్తులతో ఓటర్లను వశపర్చుకునేందుకు తాయిలాలను ఎర చూపుతున్నారు. ప్రచారం ముగియడంతో అసలు అధ్యా యానికి తెరలేపారు. ఓటర్లను ప్రభావితం ఏ అవకాశాన్ని వదలటం లేదు. పంపకాలకు, మందు విందులకు రంగం సిద్ధమైంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ఓటర్లను ప్రభావితం చేస్తున్నారు.

హామీల ఎర..

ఎన్నికల్లో గెలిస్తే వెంకటగిరి నియోజకవర్గంలో ఆల్తూరుపాడు రిజర్వాయర్ పూర్తి, లింక్ రోడ్లను బీటి రోడ్లుగా అభివృద్ధి, పలు విద్యాసంస్థల ఏర్పాటు, చేనేతలకు విద్యుత్ సబ్సిడీ, సామాజికవర్గానికి భవనాలు కట్టిస్తామని రకరకాల హామీలిస్తూ ఓటర్లను ప్రభావితం చేసేందుకు నాయకులు యథాశక్తిగా ప్రయత్నిస్తున్నారు. నిజానికి ఎన్నికల్లో హామీలు ఇవ్వడం, తర్వాత మరిచిపోవడం సాధారణమే అయినా ఈసారి మాత్రం అభ్యర్థులు క్షేత్రస్థాయిల్లో రోడ్ షోలు నిర్వహించి ఆయా మండలాల్లో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలను పదేపదే వల్లి వేశారు.

ముంచెత్తుతున్న డబ్బు..

రాజకీయాలు ఖరీదు అయిపోయాయ. ప్రజాసేవ అనే ధోరణి మారిపోయి లాభసాటి వ్యాపారంతా పరిణమించాయి. ఎంత వెచ్చించాం. ఎంత సంపాదించామనే వ్యాపార లక్షణం కనిపిస్తుంది. పోటీపడి ఓటర్లకు డబ్బు పంపిణీ చేయాల్సిన పరిస్థితి రావడంతో కాసులు ఉన్న వారికే టికెట్ ఇస్తామన్నట్లు అన్ని పార్టీలు ఎన్నికల్లో ఎంత మొత్తంలో వెచ్చిస్తావంటూ ఆశావహుల్ని బహిరంగంగానే ప్రశ్నించి టిక్కెట్లు ఇచ్చాయి. ఒక్కో అభ్యర్థి స్థాయిని బట్టి ఖర్చులకు వెనకాడకుండా నీళ్ల ప్రాయంలా డబ్బులు వెదజల్లుతున్నారు. గత ఎన్నికల కంటే ఈసారి ఎన్నికలు మరీ ఖరీదు అయ్యాయి. ఒక్కో అభ్యర్థి అనధికారికంగా రూ.5 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు వెచ్చిస్తున్నారు. ఈ లెక్కన ఇద్దరు ముగ్గురు అభ్యర్థులు బరిలో ఉంటే రూ.వందల కోట్ల ఖర్చులు దాటిపోతున్నాయి. అంటే ధన ప్రవాహం ఎన్నికల్లో ఎంత ప్రభావం చూపుతుందో స్పష్టమవుతుంది.



మద్యం మత్తు..

ఎన్నికల్లో మద్యం ప్రధాన ఇంధనంగా మారింది. ప్రచారంలో అలసి సొలసిన నాయకులకు, కార్యకర్తలకు మందుతోనే స్వాంతన లభిస్తుందని భావిస్తున్నారు. ఎన్నికల వేళ బీరు, లిక్కర్, బ్రాంది, విస్కీ, కల్లు పంపిణీ చేసేందుకు అన్నిపక్షాల నాయకులు సిద్ధమయ్యారు. ఈసారి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మద్యం దుకాణాల్లో మద్యం విక్రయాలపై నియంత్రణ ఉండడంతో ఓటర్లకు మద్యం పంపిణీ చేయలేక పలు పార్టీల నాయకులు తలలు పట్టుకుంటున్నారు. గతంలో ఎన్నికలకు మూడు రోజులు ముందుగానే ప్రతిరోజు రాత్రి మద్యం పరవళ్ళు తొక్కేవి. ఈ దఫా ఎన్నికల్లో మద్యం పంపకాలు ఆశించిన విధంగా చేయలేకపోవడంతో ఓటుకు నగదు భారీ స్థాయిలోనే ఓటర్లకు అందింది. కనీసం పోలింగ్ ముందు రోజు రాత్రి అయిన ఓటర్లను మత్తులో ముంచేందుకు నాయకులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

ఈ రెండు రోజులు మరింత కీలకం

- వెబ్ కాస్టింగ్‌తో కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పూర్తి పర్యవేక్షణ
- నోడల్ అధికారులు అత్యుత్తమ పనితీరు కనబరచాలి
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.షన్మోహన్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్:

ఎన్నికల షెడ్యూలు విడుదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు కమాండ్ కంట్రోల్ రూమ్ సమర్థవంతంగా పని చేస్తోందని, ఈనెల 12, 13 రెండు రోజులు మరింత కీలకమని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.షన్మోహన్ పేర్కొన్నారు. శనివారం జేసీ శ్రీనివాసులతో కలిసి కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో పోలింగ్ ప్రక్రియ అత్యంత కీలకమని, ఈనెల 12, 13వ తేదీల్లో కమాండ్ కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వర్తిస్తున్న నోడల్ అధికారులందరూ అత్యుత్తమ పని తీరు కనపరుస్తూ పనిచేయాలన్నారు. కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా పూర్తి పర్యవేక్షణ జరుగుతుందని తెలిపారు. నోడల్ అధికారులకు కేటాయించిన విధులకు సంబంధించి అప్రమత్తంగా ఉంటూ అవసరమైన నివేదికలను వెంటనే సిద్ధం చేయాలని ఆదేశించారు. సి-విజిల్ యాప్‌లో వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించడం జరుగుతుందని స్పష్టం చేశారు. అప్రమత్తంగా బాధ్యతతో పనిచేయాలన్నారు. లోటుపాట్లకు తావు లేకుండా సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణకు సమిష్టిగా కృషి చేసి విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. కలెక్టర్ వెంట డిఆర్ఓ బి.పుల్లయ్య కలెక్టరేట్ ఏవో వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు ఉన్నారు.

భూములు కాజేసేందుకే ఆ చట్టం


- జగన్‌ను ఓడిస్తేనే భూములకు రక్షణ
- 512జీవో ప్రతులను దగ్ధం చేసిన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కలికిరి మురళిమోహన్

ప్రజాశక్తి-తవణంపల్లి:

ప్రజల భూములను కాజేసేందుకే వైసీపీ ప్రభుత్వ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తీసుకొచ్చిందని పూతలపట్టు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మురళిమోహన్ ఆరోపించారు. శనివారం తవణంపల్లి మండలంలో ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వల్ల కలిగే నష్టాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జీవో 512 ప్రతులను ఆయన తగలబెట్టారు. భూములకు రక్షణ ఉండాలంటే వైఎస్ జగన్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు.

భూ మాఫియా ద్వారా లక్షల ఎకరాల భూములు కబ్జా చేసేందుకు అనువుగా ఆ చట్టాన్ని తీసుకొచ్చారని మండిపడ్డారు.

భూములకు రక్షణ ఉండాలంటే టీడీపీ ప్రభుత్వానికి అధికారమివ్వాలని కోరారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు దిలీప్ కుమార్, మోహన్ నాయుడు, అభిమానులు పాల్గొన్నారు.



పారదర్శకంగా పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.షన్మోహన్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్:

పోలింగ్ సిబ్బంది 3వ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.షన్మోహన్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల పరిశీలకులు షాదిక్ ఆలం, శంకర్ ప్రసాద్ శర్మలు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేపట్టారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల నిర్వహణకు ఏడు నియోజకవర్గాలకు సంబంధించి 1840మంది ప్రిసైడింగ్ అధికారులు (పీఓ)-1979మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు (ఎపిఓ), 7922మంది ఇతర పోలింగ్ సిబ్బంది, 569మంది మైక్రో అబ్జర్వర్లలకు పారదర్శకంగా మూడో ర్యాండమైజేషన్ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తి చేసినట్లు చెప్పారు. ఎన్ఐసి సాఫ్ట్వేర్‌లో ఆన్‌లైన్ ద్వారా ర్యాండమైజేషన్ పూర్తి చేశామని తెలిపారు. పోలింగ్ విధులకు కేటాయించబడ్డ సిబ్బంది ఈనెల 12వ తేదీ ఉదయం7గంటల కల్లా వారి కేటాయించిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో తప్పక హాజరుకావాలని తెలిపారు.

సమావేశంలో డిఆర్ఓ బి.పుల్లయ్య, మ్యాన్ పవర్ మేనేజ్మెంట్ మోడల్ అధికారి శివయ్య, రాజకీయ పార్టీల ప్రతినిధులు బిజెపి అట్లూరి శ్రీనివాస్, టిడిపి నుంచి సురేంద్ర కుమార్, వైసీపీ నుంచి ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభినయ్, గురుమూర్తికే ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించండి

- టీటీడీ ఛైర్మన్ భూమన

ప్రజాశక్తి-తిరుపతి సిటీ:



యువకులైన భూమన అభినయ్ రెడ్డి, గురుమూర్తికి ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తిరుపతి ఓటర్లకు పిలుపునిచ్చారు. శనివారం జీవితంలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ మీ అందరికీ వైకుంఠ ఏకాదశి పర్వదిన సందర్భంగా స్వామి వారి దర్శనం చేయించినందుకు భిక్షగా మాకు ఓట్లు వేయమని అడుగుతున్నాం. చెవులు సరిగ్గా వినపడని, కళ్లు సరిగ్గా కనబడని ఆరణి శ్రీనివాసులు, వర ప్రసాద్‌ను ఓడించండి. అభివృద్ధికి అభినయ్ మారు పేరు అని రాష్ట్ర మంతటా పేరు మారుమోగుతోందన్నారు. నాన్ లోకల్ అభ్యర్థి అయిన చిత్తూరోడు శ్రీనివాసులు ఇక్కడ పోటీ చేసేదేంటి. ఆయన దొంగ కోళ్ళ పట్టుకునే రకం. బిత్తిరి సత్తిగాడికి, బిత్తర చూపులు చూసే ఆరణి శ్రీనివాసులుకి పెద్దగా తేడా లేదు. చిత్తూరు రౌడీలతో దౌర్జన్యం చేయడానికి శ్రీనివాసులు ఇక్కడికి వచ్చాడు. మమ్మల్ని గూండాలు అంటారా, వీళ్లంతా నులిపురుగులతో సమానం పని ఎద్దేవ చేశారు. నారా లోకేష్ కూడా మా గురించి మాట్లాడుతున్నాడు. పప్పు అని గూగుల్‌లో సెర్చ్ చేస్తే లోకేష్ బొమ్మ చూపిస్తుంది. అదీ లోకేష్ పరిస్థితి అన్నారు. ఈ కార్యక్రమంలో భూమన అభినయ్ రెడ్డి, మద్దిల గురుమూర్తి, మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్లు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

23 రూట్లు, 23మంది సెక్టోరియల్, 23మంది రూట్ ఆఫీసర్లు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఎన్నికల విధులుపై పూర్తి అవగాహన కలిగి ఉంటేనే 13పోలింగ్ రోజు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలింగ్ విజయవంతంగా నిర్వహించగలుగుతారని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక పివికెయన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు జేసీ పి.శ్రీనివాసులు, ఏఆర్ఓలు డాక్టర్ జె.అరుణ, శ్రీనివాసులు రెడ్డి, విజయలక్ష్మిలతో కలసి డిస్ ప్యాచింగ్ సెంటర్‌లో 13న పోలింగ్ రోజు చేయాల్సిన అంశాలపై బియల్ఓలు, సెక్టోరియల్, రూట్ ఆఫీసుర్లుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఆదివారం కేటాయించిన విదులపై వారు పూర్తి అవగాహన కలిగి ఉంటారో వారు 13న పోలింగ్ నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలింగ్ విజయవంతంగా నిర్వహించగలుగుతారని, విధులపై అవగాహన సరిగా లేకపోతే 13న పోలింగ్ నిర్వహించడంలో ఇబ్బందులు పడవలసి ఉంటుందని, ఈ రెండు నెలలు కష్టపడ్డ శ్రమ వధా అవుతుందని, ఇంకా విదులపై అవగాహన లేకపోతే తెలుసుకొని జాగ్రత్తగా విధులు నిర్వహించాలని సెక్టోరియల్, రూట్ ఆఫీసుర్లు, బియల్ఓలను ఆదేశించారు. ఈ సమావేశంలో చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం రిటన్నింగ్ అధికారి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 6గంటలకల్లా పివికెయన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ ప్యాచింగ్ సెంటర్ నందు ఆర్ఓ వద్ద రిపోర్ట్ చేయాలని సెక్టోరియల్, రూట్ ఆఫీసుర్లును ఆదేశించారు. డెస్ ప్యాచింగ్ సెంటర్ నందు 23 కౌంటర్లు,4 హెల్ప్ డిస్కలు,నోటీస్ బోర్డ్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. 23 మంది సెక్టోరియల్,23 మంది రూట్ ఆఫీసుర్లు వారికి కేటాయించిన కౌంటర్ కేంద్రాల వద్దకు చేరుకోవలన్నారు. ఆయా పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన పిఓలు, ఏపిఓలు, ఓపిఓలు, మైక్రో అబ్జర్వర్లు, వెబ్ కాస్టింగ్, వీడియో గ్రాఫర్లు, పోలీస్ అధికారులు వచ్చారా లేదాని పరిశీలించుకోవలన్నారు. ఎవ్వరైనా రాక పోతే వెంటనే ఆర్ఓ దష్టికి తీసుకు రావాలన్నారు. సెక్టోరియల్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల వారిగా అసెంబ్లీకి, పార్లమెంట్‌కు సంబంధించి బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి ఫ్యాట్లను, మెటీరియర్లన్నీ వచ్చాయా లేవాని చెక్ చేసుకోవాలన్నారు. బెల్ కంపిణి ఇంజనీర్లు ద్వారా ఈవియంలపై అవగాహన కలిగించడం జరుగుతుందన్నారు. వారికి కేటాయించిన బస్సులు బయలుదేరి సాయంత్రం 4గంటల కల్లా వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకోవలన్నారు. ఆరోజు రాత్రికే పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఫర్నిచర్స్ ఏర్పాటు చేసుకోవాలని, పోలింగ్ ఏజెంట్లు తో మాట్లాడుకొని 13చేదు ఉదయం 5.30 గంటలకల్లా పోలింగ్ కేంద్రాలకు రావాలని ఏజెంట్లు తెలపాలన్నారు. 13తేదీ ఉదయం నాలుగు గంటలకల్లా పిఓలు ఏపీఓలు,ఓ పి ఓ లు సిబ్బంది అందరు రెడీగా ఉండాలన్నారు. 5.30 గంటలకు పోలింగ్ ఏజెంట్లు సమక్షంలో మాక్ పోల్ నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో చిత్తూరు, గుడిపాల మండలాల యంపిడిఓలు సుధాకర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఎలక్షన్స్ డిటీలు హిమగిరి, కిరణ్, ఎస్‌వో సౌందర్యరాజన్, సెక్టోరియల్, రూట్ ఆఫీసుర్లు, బియల్‌వోలు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితునికి ఆర్థిక చేయూత

ప్రజాశక్తి- వాకాడు: మండలంలో అనారోగ్య సమస్యల కారణంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న దీవి శ్రీనివాసమూర్తి కుటుంబానికి ప్రవాస భారతీయులు రామిరెడ్డి వెంకటరామిరెడ్డి, హైమావతమ్మ దంపతులు సాయం అందించారు. వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం గ్రామంలోని శ్రీ పట్టాభిరామాలయ శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ సాయం 20 వేల రూపాయల నగదు, 5వేల రూపాయలు ఫలసరుకులు, కూరగాయలను అర్చక సంఘం నాయకులు, గ్రామీణ వైద్యులు పరాంకుశం నాగార్జునాచార్యులు, సంస్థ ప్రతినిధి దీవి అనంత బాబు చేతుల మీదుగా శనివారం సాయం అందించారు. ఈ సందర్భంగా నాగార్జునాచార్యులు మాట్లాడుతూ 25 వేల రూపాయలను అందించి ఆదుకుంటున్న దాతలు వేంకటరామిరెడ్డి, హైమావతమ్మ దంపతులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దీవి విజయలక్ష్మి, నారాయణం సాయి, గోపికృష్ణ, గాయత్రి, అభ్యుదయ, మోక్షిత్, షన్విత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రజక సంఘం ఐక్యవేదిక అధ్యక్షులు ఉమాపతి

రజకులను వంచించింది చంద్రబాబే: ఉమాపతి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చుతానని కల్లబొల్లి హామీలు ఇచ్చి వంచించింది నారా చంద్రబాబు నాయుడే అని రజక సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు మల్లెమొగ్గల ఉమాపతి తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పని చేసిన వ్యక్తి అధికారం కోసం ఎంతకైనా దిగజారే ఘటనలను చంద్రబాబు జీవితంలో మనం చూడవచ్చున్నారు. మరోసారి రాష్ట్ర ప్రజలను మోసం చేయడానికి బిజెపి, జనసేనలతో పొత్తు గట్టి ఎన్నికల బరిలో కూటమి అభ్యర్థులుగా నిలిపారన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా కుల మతాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నియోజకవర్గ పరిధిలోని రజకులకు సముచిత ప్రాధాన్యం ఇచ్చి వారి అభివృద్ధికి తోడ్పాటు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంకల ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాము, జిల్లా ఉపాధ్యక్షులు అంజి, నాయకులు వేణు, రెడ్డప్ప, లోకేశ్వర్, మౌళి పాల్గొన్నారు.

'ముస్లింల అభివృద్ధి వైసీపీతోనే సాధ్యం'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముస్లిం సమాజానికి నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించింది వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని, ఆ రిజర్వేషన్లను కొనసాగించిన వైసీపీ ప్రభుత్వానికి ముస్లింలు అండగా నిలిచి అభివృద్ధి చెందుదామని వైసిపి మైనారిటీ విభాగం రీజనల్ కోఆర్డినేటర్ సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రి పిలుపు నిచ్చారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారం చేపడితే ముస్లింలకు కల్పించిన నాలుగు శాతం రిజర్వేషన్లను రద్దు చేస్తుందని, కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే ముస్లింలను దగా చేస్తారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్త ముస్లింలకు సముచిత స్థానాన్ని ఇచ్చి గౌరవించిన వ్యక్తి సీఎం జగన్ అని, ఈ సార్వత్రిక ఎన్నికల్లో వైసిపికి ముస్లింలు అండగా నిలవాలని కోరారు. ఈ సమావేశంలో మైనార్టీ నాయకులు చాంద్ బాషా, అహ్మద్, ఫరీద్ భాయ్, ఇనయ్ తుల్లా పాల్గొన్నారు.

మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్: గాలి భానుప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : సైకిల్‌కు ఓటేసి టిడిపిని గెలిపిస్తే మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచితంగా విద్యుత్ అందిస్తామని నగరి నియోజకవర్గ టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ హామీ ఇచ్చారు. పుత్తూరు, నగరి మున్సిపాలిటీ కొత్తపేటలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మరమగ్గ కార్మికుల కష్టాలు తీరాలంటే సైకిల్ గుర్తుకు ఓటేయ్యాలని ఓటర్లకు సూచించారు. నగరి ప్రజల సంక్షేమం, అభివృద్ధి టిడిపితోనే సాధ్యం అవుతుందని తెలిపారు.. సైకిల్ కు ఓటేస్తేనే నెలకు రు.4 వేలు ఇంటివద్దకే పింఛన్ వస్తుందని, బిసిలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చారు. నగరికి ఒక్క పరిశ్రమ తీసుకురాని అవినీతి లో మునిగిపోయిన రోజా ను ఓడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు. పాల్గొన్నారు.

కనిపించని ఎంసిసి, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు

- యథేచ్ఛగా ఓటర్లకు నగదు పంపిణీ
- చర్యలు శూన్యం



కనిపించని ఎంసిసి, ఫ్లైయింగ్ స్క్వాడ్ వాహనం

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు నియోజక వర్గంలో అభ్యర్థులు యథేచ్ఛగా ఓటర్లకు డబ్బుల గాలం వేశారు. ఇష్టానుసారం నగదు పంపిణీ చేసినా సంబంధిత ఎన్నికల అధికారులు కాని, ఎంసిసి, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు కాని పరిశీలించి చర్యలు తీసుకోలేదు. తిరుపతి జిల్లా సత్యవేడులో ఓటర్లను మచ్చిక చేసుకునే పనిలో ప్రధాన పార్టీ అభ్యర్థుల అనుచరులతో పాటు స్వతంత్ర అభ్యర్థి అనుచరులు నోటుతో ఓటును గాలం వేశారు. గత రెండు రోజులుగా ఓటర్లకు నగదు పంపకాలు మొదలయ్యాయి. రెండు ప్రధాన పార్టీలు ఇప్పటికే ఓటర్లకు నగదు పంపిణీని ముమ్మరం చేశాయి. తమ పార్టీకి ఓట్లు వేస్తారనుకునే కుటుంబాలకు పార్టీ అనుచరుల ద్వారా వెయ్యి నుంచి రూ. 1500 వరకు ఓటర్లకు పంపిణీ చేస్తుండగా, తామేమి తక్కువ కాదన్నట్టు ఓ స్వతంత్ర అభ్యర్థి ఒక్క ఓటుకు 2వేల రూపాయలు చొప్పున పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. పగలు రాత్రి తేడా లేకుండా ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తూ నగదు పంపిణీ చేస్తున్నా సంబంధిత ఎంసిసి, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ప్రేక్షక పాత్ర వహించడం పట్ల సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాల్సి వుంది.

కేంద్రంలో విజయం కాంగ్రెస్‌దే..

- తిరుపతి ఎంపి అభ్యర్థి చింతా మోహన్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : కేంద్రంలో రాబోయే ఎన్నికల్లో ఇండియా ఫోరం విజయం సాధించి కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, వచ్చిన వెంటనే దుగారాజ పట్టణం పోర్టు నిర్మాణం పనులు ప్రారంభిస్తామని తిరుపతి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చింతామోహన్ పేర్కొన్నారు. శనివారం గూడూరు పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో కాంగ్రెస్ తిరుపతి ఎంపి అభ్యర్థి చింతామోహన్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపిలకు ప్రజాదరణ తగ్గిపోయిందని ప్రజల మార్పు కోరుకుంటున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ని గెలిపించాలని గెలిచిన వెంటనే దుగరాజ పట్టణం పోర్ట్ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. పోర్టు నిర్మాణం జరిగితే గూడూరు పట్టణం మహానగరంగా అభివృద్ధి చెందుతుందని లక్షలాది ఉద్యోగాలు వస్తాయని వెల్లడించారు. ఈ ప్రచారంలో గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి రామకృష్ణారావు , దర్శి నాగభూషణం పాల్గొన్నారు.

గెలిపిస్తే వార్డుల అభివృద్ధి : జనసేన



ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : టిడిపి ఎమ్మెల్యే కూటమి అభ్యర్థి గాలి భాను ప్రకాష్‌ను గెలిపించుకుంటే అన్ని వార్డుల్లో అభివృద్ధి చేసుకోవచ్చని నగిరి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి మెరుపు మహేష్ పేర్కొన్నారు. శనివారం ఎన్నికల ప్రచారం ముగింపులో భాగంగా పుత్తూరులోని బేస్తగిరి, కాపు వీధి, ఎన్నికల ప్రచారం మున్సిపల్ మాజీ ఛైర్మన్ బిసిఆర్ యుగంధర్, మురళి ఆధ్వర్యంలో జనసేన, టిడిపి నాయకులు కలిసి శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తిరిగి టిడిపి ని గెలిపించాలని మేనిఫెస్టో కరపత్రాలను ఇచ్చి ఓట్లు వేయాభోటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా మహేష్, యుగంధర్ మాట్లాడుతూ కూటమి అభ్యర్థులు గెలుపు కోసం కలిసికట్టుగా పనిచేసే రాబోవు ఎన్నికల్లో విజయం సాధించాలని, టిడిపి చేపడుతున్న మేనిఫెస్టో మహిళలకు ఉచిత బస్, వృద్ధులకు వికలాంగులకు వితంతువులకు. ఒకటవ తేదీ నుంచి రూ.4వేలు ఇంటి వద్దకే పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. విద్యార్థులకు నెలకు 1500 చొప్పున అందిస్తారని, నిరుద్యోగ భృతి అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువకులు జనసేన యువకులు పాల్గొన్నారు

'నరువి'లో స్ట్రోక్ సెంటర్‌ను ప్రారంభించిన అస్సాం గవర్నర్



స్ట్రోక్ సెంటర్ ను ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చిత్తూరు సమీపం లో వేలూరు లోని నరువి ఆసుపత్రిలో హృద్రోగానికి చెందిన స్ట్రోక్ సెంటర్‌ను అస్సాం గవర్నర్ గులాబ్ చంద్ కటారియా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ గులాబ్ చంద్ కటారియా మాట్లాడుతూ స్ట్రోక్ సెంటర్ లో అధునాతనమైన అన్ని వసతులు ఆస్పత్రి వర్గాలు ఏర్పాటు చేయడాన్ని అభినం దించారు. తన సొంత రాష్ట్రమైన రాజస్థాన్ లో ఇలాంటి వసతులు లేవన్నారు. ఆసుపత్రి నిర్వహణపై నరువి ఆసుపత్రి వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ జీవీ సంపత్ ను అభినందించారు. సంపత్ గత 35 ఏళ్ల సామాజిక సేవా రంగంలో ఎలాంటి కళంకం లేకుండా కార్యక్రమాలు చేపడుతున్నారని, ఆసుపత్రిలోని డాక్టర్లు, సిబ్బందితో ముచ్చటించారు. గవర్న ర్ పర్యటనలో భాగంగా వేలూరు లోని రాజస్థాని సమాజ్ సభ్యులు గవర్నర్ దంపతులకు జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో నరువి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పాల్ హేన్రి, అరవింద్ నాయర్, జాకబ్ జోస్, మణి మారన్, నితిన్ సంపత్ తదితర డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన పోటాపోటీ ప్రచారాలు

ఆఖరి రోజు భారీ ర్యాలీలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:

సార్వత్రిక ఎన్నికల ప్రచారార్భాటాలు శనివారం ముగిసాయి. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రధాన పార్టీ అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు సైతం పోటాపోటీగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సుమారు నెల రోజులపాటు సాగిన ఎన్నికల ప్రచార జోరుకు శనివారం ఆఖరు రోజు కావడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు భారీ ర్యాలీలతో హోరెత్తించారు. సిట్టింగ్ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఓవైపు, ఆయన సతీమణి, కుమార్తె మరో వైపు పట్టణంలో భారీ ర్యాలీలతో ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి అసెంబ్లీకి మధు సూదన్ రెడ్డిని, పార్లమెంటుకు గురుమూర్తిని పంపించా లంటూ ఓటర్లను అభ్యర్థించారు. ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి కూటమి నాయకులతో కలిసి మిట్టకండ్రిగ నుంచి పట్టణ నాలుగు మాడ వీధుల్లో భారీ స్కూటర్ ర్యాలీ చేపట్టారు. శ్రీకాళహస్తి అభివృద్ధి సాధించాలంటే బొజ్జల పాలన తిరిగి రావాలని సూచించారు. మే 13వ తేదీ జరిగే పోలింగ్ రోజు సైకిల్ గుర్తుపై ఓటేసి సుధీర్ రెడ్డిని అసెంబ్లీకి పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్‌సివి నాయుడు పాల్గొన్నారు.

తిరుపతిలో కులచిచ్చులు పెడుతున్నారు: రవి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగరంలో ఎన్నడూ లేని విధంగా కూటమి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు కులచిచ్చులు పెడుతూ ప్రశాంత వాతావరణన్ని భగ్నం చస్తున్నారని వైయస్సార్ అభిమాని బొమ్మగుంట రవి ఆరోపించారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు ప్రజలను దగా చేసిన శ్రీనివాసులు తిరుపతి ప్రజలను కుల చిచ్చులు పెట్టి పవిత్రమైన పుణ్యక్షేత్రాన్ని భ్రష్టు పట్టించాలని కుట్రపన్నారని ఆరోపించారు. కొంత మంది రజకులు ఆరని శ్రీనివాసులు ప్రలోభాలకు లొంగి ఆయన వైపు నడవడం రజక సామాజిక వర్గానికి సిగ్గుచేటు అన్నారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు బొమ్మగుంట చక్రి, దాము, సుబ్రహ్మణ్యం, కృష్ణమూర్తి, గురవయ్య, చంగల్ రాయలు, అరుణ్ కుమార్, రాము పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి అభ్యర్థి ఆదిమూలం

టిడిపి అభ్యర్థి ప్రచారం

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు టిడిపి కూటమి అభ్యర్థి ఆదిమూలం శనివారం సత్యవేడు, దలవాయి అగ్రహారం లోని గంగ మిట్ట వద్ద గంగమ్మ కు పూజలు చేసి టిడిపి, బిజెపి, జనసేన, మాది గ దండోరా నాయ కులు, కార్యకర్తలతో శనివారం ర్యాలీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆదిమూలం మాట్లాడుతూ రాష్ట్రంలో మార్పు కనిపిస్తోందని, ఈ కారణంగా రాష్ట్రంలో చంద్రబాబు, దేశంలో మోడీ విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజక వర్గంలో క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తల శ్రమ చాలా గొప్ప దన్నారు. వారి సేవలు మరువలేనివని, అధికారంలో కొచ్చిన వెంటనే శ్రమించిన వారికి తగిన గుర్తింపు ఇస్తామని పేర్కొన్నారు. విమర్శలకు దూరంగా, ల అరాచకాలను దీటుగా ఎదుర్కొని ప్రశాంతంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునే విధం గా ఉమ్మడి కూటమి నేతలు , కార్యకర్తలు ముందుకు వెళ్లాలని ఆదిమూలం సూచించారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా భవిష్యత్తు అంధకారం అవుతుందన్న విషయాన్ని గుర్తించి పోరాడాలని సూచించారు.

ఓజిలి : ఓజిలిలో టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ విజయం కోసం టిడిపి కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. మండలంలోని ఓజిలి , మనమాల , బత్తలపూరం ,కురుగొండ గ్రామాల్లోని పాడి వెంకటసుబ్బయ్య , కంకణాల సత్య వరప్రసాద్ నాయుడు , దువ్వూరు శ్రీనివాస్ రెడ్డి , వెంకటేష్ , గెడ్డి శ్రీనివాసులు రెడ్డి ,అనుబోలు రవీందర్ రెడ్డి , చింతల సరోజనమ్మ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ నెలవల విజయ శ్రీ , మాజీ మంత్రి వెంకట పరసారత్నం , బిజెపి నాయకులు వాకాటి నారాయణరెడ్డి , మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పాల్గొని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ విజయ్ కుమార్ నాయుడు , ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్, గున్నం రెడ్డి మధుసూదన్ రెడ్డి ,బచ్చల రవీంద్ర రెడ్డి,కనుమూరు గోపాల్ రెడ్డి ,ఎద్దుల ధనంజయ రెడ్డి ,కొండూరు ఈశ్వర్ రాజు,పాదర్తి సతీష్ నాయుడు, ప్రకాష్ నాయుడు , చింతల సతిష్ చంద్ర , ఖలీల్ నన్నూరు శ్రీనివాసులు రావు మల్లికార్జున్ రెడ్డి , ఫ్రాంక్లిన్ , కోటి పాల్గొన్నారు.

అరాచక పాలన 13తో అంతం: కిరణ్ రాయల్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రంలో అరాచక దౌర్జన్య పాలన కొనసాగించిన అధికార పార్టీ వైసీపీకి ఈ నెల 13వ తేదీతో ప్రజలు అంతం పలకనున్నారని జనసేన తిరుపతి అసెంబ్లీ బాధ్యులు కిరణ్ రాయల్ అన్నారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో జనసేన నాయకులపై కేసులు బనాయించి హౌస్ అరెస్టులు, దాడులు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వైసిపి దౌర్జన్య, దోపిడీ పాలన అంతం కావాలంటే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులును అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం జరిగే ఎన్నికలలో వైసిపి దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నిస్తారని, కూటమి పార్టీల నాయకులు ఉమ్మడిగా ప్రతి పోలింగ్ బూత్ వద్ద దొంగ ఓట్లు పోల్ కాకుండా జాగ్రత్త వహిస్తామన్నారు. ఈ సమావేశంలో ఆకేపాటి సుభాషిని, వినుతకోట, చంద్రబాబు, సుమన్ బాబు, షరీఫ్, సిద్దు, రాజేంద్ర, లోకేష్ పాల్గొన్నారు.

ముగిసిన ప్రచార ఘట్టం

ఎవరి ధీమా వారిదే

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్: శనివారం ప్రచార కార్యక్రమం ముగిసింది. గెలుపు తమదే అని ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. టిడిపి కూటమి అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ, వైసిపి అభ్యర్థి నేదరుమల్లి రామ్ కుమార్ రెడ్డి, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థి పంట శ్రీనివాసరెడ్డి, బీఎస్పీ అభ్యర్థి జయచంద్ర మధ్యే పోటీ నెలకొంది. గత నెల రోజులుగా పల్లెల్లో వారి పార్టీ అజెండాలను ప్రజలకు తెలుపుతూ విమర్శలకు ప్రతి విమర్శలతో నిర్వహిస్తున్న ప్రచారం ఘట్టానికి శనివారం తెరపడింది. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకునే అవకాశం 13వ తేదీ సోమవారం రావడంతో ప్రతి ఒక్క ఓటరు దేశ, రాష్ట్ర అభివృద్ధి నాయకుల ఆలోచనలను గుర్తించి వారి విలువైన ఓటు హక్కును వినియోగించుకుని స్వచ్ఛమైన నాయకుడిని, ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని పరిరక్షించే వ్యక్తులను ఎన్నుకోవాల్సిన బాధ్యత ప్రజలపై వుంది. అయితే ఓటర్లు తమ తీర్పును ఎవరికి ఇస్తారో అంతు చిక్కడం లేదు. ఇప్పటికే ప్రధాన పార్టీల నాయకులు ప్రచారంతో అలసి సొలసి, ప్రజల నాడిని గుర్తించలేక సతమతమవుతున్నారు. ఏది ఏమైనా 13 సోమవారం సాయంత్రానికి ఓటింగ్ పూర్తయ్యే సమయానికి ఎవరి ధీమా వారిదిగా జూన్ 4వ తేదీ వరకు వేచి చూడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.



ప్రచారం నిర్వహిస్తున్న వ్యాపార వేత్త ఏవి రమణమూర్తి

పులివర్తి నాని గెలుపే ధ్యేయం: ఏవి రమణమూర్తి

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి): రానున్న సాధారణ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించి అధికారం చేపట్టి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయమని చంద్రగిరి నియోజకవర్గంలో పులివర్తి నానిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవటమే తమ ధ్యేయమని చంద్రగిరి మండలం ఐతేపల్లికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ఏవి రమణమూర్తి తెలిపారు. తన వ్యాపారాల పక్కనపెట్టి స్వగ్రామంలోనే తిష్ట వేసిన ఆయన ప్రతిరోజు తన అనుచరులు, టిడిపి కార్యకర్తలతో ప్రచారం నిర్వహిస్తూ సొంత నిధులు వెచ్చించి పంచాయతీలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఐతేపల్లి పంచాయితీలో ఏవి రమణమూర్తి ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన ఇంటింటి ప్రచారంకు విశేష స్పందన లభించింది. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని గెలుపు కోసం ఒక్క పిలుపుతో పంచాయితీ ప్రజలు స్వచ్ఛందంగా ప్రచారానికి పోటెత్తారు. యువకులు ఉత్సాహంతో ముందుకు సాగారు. ఆప్యాయతను చూపిస్తూ ప్రతి ఇంటా రమణమూర్తికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. మీ వెంట మేమున్నాం అంటూ నా పంచాయితీ ప్రజలు భరోసా ఇచ్చారు. ప్రజలు చూపిస్తున్న ఆదరాభిమానాలు, ప్రేమ, ఆప్యాయతలు నా భాధ్యతలను మరింత పెంచుతున్నాయని వారి సాధక బాధకాలలో ఎల్లవేళలా అండదండలుగా ఉంటానని రమణమూర్తి తెలిపారు. సోమవారం జరుగనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పులివర్తి నానికి, ఎంపీగా దగ్గుమళ్ళ ప్రసాద్ రావుకు ఓటు వేసి గెలిపించేందుకు సిద్దంగా ఉన్నారని ఆయన తెలిపారు. ఇక విజయోత్సవ సంబరాలకు సంసిద్ధమవటమే ఆలస్యం అని చెప్పారు. ఈ కార్యక్రమంలోటిడిపి, జనసేన, బిజెపి నాయకులు విశ్వనాథం, వెంకటముని, మునిచంద్ర యాదవ్, లతీష్, రవిరావు, ఎవిఆర్ యువసేన, సుబ్రమణ్యం మహిళలు పాల్గొన్నారు.

అవకాశమిస్తే అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా: రామ్‌కుమార్‌రెడ్డి



ప్రజాశక్తి- వెంకటగిరి: తనను ఆదరించి అవకాశం ఇస్తే వెంకటగిరి రూపురేఖలు మార్చేలా అభివృద్ధి ప్రణాళికను అమలు చేస్తానని వైసిపి వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. స్థానిక ఆయన నివాసంలోని ఎన్ జె ఆర్ భవన్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరి కొన్ని గంటల్లో నిర్వహించనున్న ఎన్నికల్లో ప్రజలు వైసిపికి ఏకపక్షంగా పట్టం కట్టబోతు న్నారని, సీఎంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి మరోసారి విశాఖలో ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమని చెప్పారు.

తనకు ఓటేస్తే ప్రయోజనాలు 2023 జనవరిలో తనను వెంకటగిరి వైసిపి ఇన్‌ఛార్జిగా నియమించిన 15 నెలల కాలంలో సాధించిన ప్రగతిని నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి వివరించారు.

– రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నియోజకవర్గంలో 53 కోట్ల జిజిఎంపి నిధులను సాధించి అభివృద్ధి పనులు చేశామన్నారు. వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా గుర్తింపు తీసుకురావడం , 110 ఎకరాల్లో నగరవనం ఏర్పాటుకు యత్నం, ప్రతిష్టాత్మకమైన ఇండియన్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ కళాశాల ఆధునీకరణకు తన సొంత నిధులు రూ 45 లక్షలు వెచ్చించడం, ఆ కళాశాలలో సిబ్బంది నియామకం, కొత్త కోర్సులకు ప్రభుత్వంకు ప్రతిపాదనలు, కలువాయిలో గురుకుల పాఠశాల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. బీసీ భవన్ నిర్మాణానికి అనుమతులు, కేంద్ర ప్రభుత్వ నిధులతో ఎంపీ గురుమూర్తి సహకారంతో పెంచలకోన ఏర్పేడు – జాతీయ రహదారిపై వెంకటగిరిలో నూతనంగా సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు వంటివి ఏడాది కాలంలో సాధించిన తనకు నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే ఐదేళ్లలో అభివృద్ధి పరుగులు పెట్టిస్తానని నేదురుమల్లి స్పష్టం చేశారు.

రాజకీయ పార్టీల ప్రచారాలకు తెర

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో హోరాహోరీగా ప్రజల మధ్య సాగిన రాజకీయ పార్టీల ప్రచారాలు శనివారం ముగిశాయి.

వైసిపి ప్రచారాలు

చంద్రగిరి నియోజకవర్గ వైసిపి అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి నియోజకవర్గ పరిధిలోని మంగళం, రామచంద్రపురం మండలంలోని కుప్పం బాదూరు, చంద్రగిరి క్లాక్ టవర్ వద్ద ఇలా నియోజకవర్గ పరిధిలో తన అభ్యర్థిత్వాన్ని బలపరచాలని స్థానిక ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ ప్రచారం ముగింపు సభలను ఘనంగా నిర్వహించారు. ఈ సభలకు స్థానిక నాయకత్వం భారీగా జన సమీకరణ చేసింది.

టిడిపి ప్రచారాలు

చంద్రగిరి నియోజకవర్గ కూటమి టిడిపి అభ్యర్థి పులివర్తి నాని అభ్యర్థిత్వాన్ని బలపరచాలని స్థానిక ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ కొనసాగిన ప్రచార కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. ముగింపు ప్రచార సభలను నిర్వహించి పార్టీ కార్యకర్తలు, నాయకులు బైక్ ర్యాలీలు ర్యాలీలు చేస్తూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ కు సంబంధించిన ప్రతులను దగ్ధం చేశారు. మంగళంలో టిడిపి, జనసేన పార్టీల నాయకులు ర్యాలీలు చేస్తూ పులివర్తి నాని అభ్యర్థిత్వాన్ని బలపరచాలని స్థానిక ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

స్వరూపకు డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయంలో ఇన్‌స్టిట్యూట్ అఫ్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ విభాగ పరిశోధనా విద్యార్థిని బి స్వరూపకి డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ ఎ శ్రీదేవీ ఆధ్వర్యంలో 'డెవలప్‌మెంట్ ఆఫ్ ఎక్యూబిడి–బేస్డ్ స్టబిలిటీ–ఇండికేటింగ్ ఆనలైటికల్ మెథడ్స్ అండ్ వాలిడేషన్ అఫ్ సెలెక్టెడ్ డ్రగ్స్ బై క్రొమటోగ్రఫిక్ టెక్నిక్స్' అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించినందుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు రిజిస్ట్రార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ ప్రొఫెసర్ ఎ శ్రీదేవీ, డైరెక్టర్ ఆఫ్ ఎగ్జామినర్ ప్రొఫెసర్ బి జీవనజ్యోతి అభినందనలు తెలిపారు.

ఉమకు డాక్టరేట్



క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం న్యాయ శాస్త్ర విభాగపు పరిశోధక విద్యార్థిని వి.ఆర్. ఉమకు డాక్టరేట్ ప్రదానం చేశారు. న్యాయ శాస్త్ర విభాగపు ఆచార్యులు ప్రొఫెసర్ డా.టి.సీతా కుమారి పర్యవేక్షణలో "లా రిలేటింగ్ టు సీనియర్ సిటిజన్స్ ఇన్ ఇండియా – ఇష్యూస్ అండ్ ఛాలెంజ్స్' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని ఉమ సమర్పించారు. ఇందుకు ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారు.

శ్రీ కోదండరామాలయంలో పుష్పయాగానికి అంకురార్పణ

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి శ్రీకోదండ రామస్వామి ఆలయంలో మే 12వ తేదీ ఆదివారం నిర్వహించనున్న పుష్పయాగానికి శనివారం సాయంత్రం ఘనంగా అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు ఆచార్య రుత్విక్ వరణం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు సేనాధిపతి ఉత్సవం, రాత్రి 7 గంటలకు మేదినీపూజ, మృత్సంగ్రహణం, శాస్త్రోక్తంగా అంకురార్పణం చేపట్టారు. మే 12న ఆదివారం ఉదయం 10 గంటలకు స్నపనతిరుమంజనం, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు వేడుకగా పుష్పయాగం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పలురకాల పుష్పాలతో స్వామి, అమ్మవార్లకు అభిషేకం చేస్తారు. అనంతరం రాత్రి 7 గంటలకు శ్రీసీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తారు. గృహస్తులు(ఇద్దరు) రూ. వెయ్యి చెల్లించి టికెట్ కొనుగోలుచేసి పుష్పయాగంలో పాల్గొనవచ్చునని ఆలయాధికారులు తెలిపారు.

డబ్బు పంచి.. ప్రలోభాల్లో ముంచి..

- నగదు, కానుకలు, మద్యంతో ఓటర్లకు వల
- ఉమ్మడి జిల్లాలో పొరుగు ముఠాల రంగప్రవేశం
- నిఘా వ్యవస్థ ఉన్నా పట్టని వైనం

ప్రజాశక్తి - తిరుపతి: పోలింగ్ రోజు దగ్గరపడే కొద్దీ ప్రలోభాల జాతర రోజురోజుకు ముదురుతోంది. ఎన్నికల కోసం దాచి ఉంచిన నోట్ల సంచులు బయటకొస్తున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఓటుకు రేటు కట్టి.. రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు పంపిణీ చేస్తున్నారు. ఎన్నికల ముందు రోజు మరింత వేగం పెంచనున్నారు. ప్రాంతాల వారీగా నమ్మకమైన నాయకులు, కార్యకర్తలు, ఇటీవల రాజీనామా చేసిన వాలంటీర్లు, కొన్నిచోట్ల ఐప్యాక్ సభ్యుల పర్యవేక్షణలో ఈ తంతు జరుగుతోంది. మరోసారి అధికారం చేజిక్కించుకోడానికి అధికార పార్టీలు అడ్డదారులు తొక్కుతుంటే... ఈసారైనా ఎలాగైనా అధికార పీఠంపై కూర్చునేందుకు కూటమి పార్టీలు సర్వ శక్తులూ వడ్డుతున్నాయి. సమర్ధ నేతలను చట్ట సభలకు పంపి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుందామని ప్రజాస్వామ్యవాదులు పరితపిస్తుంటే ... ఓటర్లను తమ వైపుకు తిప్పుకునేందుకు, ప్రలోభాల తో వశపరచుకునేందుకు అటు అధికార, ప్రతిపక్ష పార్టీలు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నాయి. గతంలో రాత్రి సమయంలో మాత్రమే పంపిణీ చేపట్టే నాయకులు ఇప్పుడు పగలే చేస్తుండడం నిఘా వ్యవస్థ డొల్లతనాన్ని ఎత్తి చూపుతోంది. పొరుగు ప్రాంతాల నుంచి నమ్మకమైన నేతలను రప్పించుకుని వారి ద్వారా నగదు, కానుకల పంపిణీకి తెరలేపింది. సలహా బృందంతోపాటు ప్రత్యేక సొంత సైన్యమూ పనిచేస్తునడం గమనార్హం.

నోట్ల కట్టల ఎర

తీసుకోవడమే తప్ప ఎన్నడూ తిరిగి ఇవ్వని చరిత్ర ఉన్న తండ్రి కొడుకులు సైతం ఈ దఫా తిరుపతి నియోజకవర్గంలో అధికార పార్టీ నేతలు ఓటుకు రూ.2వేలు చొప్పున పంపిణీ చేస్తున్నారు. అదే క్రమంలో కూటమినేతల పక్షాన మరో రూ.2వేలు చొప్పున పంచుతూ ఓటర్లను ప్రభావితం చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కూటమి తరపున పోటీలో ఉన్న అసెంబ్లీ అభ్యర్థి మరో వెయ్యి రూపాయలు ఇచ్చేందుకు వెనుకాడడం లేదని తెలుస్తోంది. ఇక చంద్రగిరి నియోజకవర్గంలో ఇప్పటికే గోడ గడియారాలు ప్రెషర్ కుక్కర్లు, దుస్తులు సెల్ ఫోన్లు పంపిణీ చేసిన అధికార పార్టీ నేత ఇప్పుడు తాజాగా ఓటుకు రూ.2వేలు చొప్పల పంపిణీ చేశారు. అదనంగా ఒక్కో ఇంటికి మరో రూ2 వేలు చొప్పున ఇచ్చేందుకు కార్యకర్తలు సన్నద్ధమయ్యారు. టిడిపి తరపున బరిలో నిలిచిన అభ్యర్థి సైతం రూ. 2వేలు చొప్పున పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అయితే మంగళం, తిరుచానూరు, చంద్రగిరి ప్రాంతాల్లో టిడిపి నేతల పంపిణీకి మాత్రం అధికార పార్టీ నేతలు అనేక అడ్డంకులు సృష్టిస్తున్నారని తెలుస్తోంది. టిడిపి ముఖ్య నేతలు వారి అనుచరుల కదలికలపై నిత్యం నిఘా ఉండడం అవసరమైతే పోలీసులు రంగ ప్రవేశం చేసి మరి వారిని సోదాలు చేసి మరి భయభ్రాంతులను గురి చేస్తున్నారని వాపోతున్నారు. ఇక పుంగనూరు నియోజకవర్గంలో అధికార పార్టీ నేతలు రూపాయలు 3వేలు ఇస్తుంటే, అక్కడ స్వతంత్రంగా బరిలోకి దిగిన ఇండిపెండెంట్ అభ్యర్థిలే ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇక నగరి, శ్రీకాళహస్తి, సత్యవేడు, జీడీ నెల్లూరు, పూతలపట్టు, పలమనేరు లో ఓటుకు 2 వేలు చొప్పున పంపిణీ చేస్తుండగా, కుప్పంలో మూడు నుంచి నాలుగు వేలు చొప్పున ఇస్తూ ఓటర్ల ప్రభావితం చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న తిరుపతి, చంద్రగిరి, పుంగనూరు, కుప్పం నియోజకవర్గాల్లో ఇప్పటికే పెద్దఎత్తున చేరుకున్న పొరుగు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రైవేట్ సైన్యం ప్రలోభాల జాతరలో అత్యంత క్రియాశీలకంగా మారింది. పోల్ మేనేజ్మెంట్ లో భాగంగా స్థానికంగా ఉన్న ఒక్కో నాయకుని స్థాయిని బట్టి రూ.50వేల నుంచి రూ.2 లక్షల వరకు పంపిణీ చేస్తోంది. ఇతర పార్టీల ఏజెంట్లనూ లొంగదీసుకునే పనిలో ఉన్నారు. డివిజన్లో ద్వితీయ శ్రేణి నాయకులు 15 నుంచి 20 మంది వరకు గుర్తించి రూ.5 వేల చొప్పున అడ్వాన్సులూ ఇచ్చారు. మద్యం నిల్వలు దండిగా సిద్ధం చేసుకుంటుండటం గమనార్హం. ఏజెంట్లకు సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు అన్ని వర్గాల ఓటర్లు నేరుగా పరిచయం ఉండదు. బూత్ కమిటీలకు మాత్రమే ఓటర్లతో ప్రత్యక్ష సంబంధాలు ఉంటాయి. దీంతో అభ్యర్థులు ఈ కమిటీలపైనే ఆధారపడా ల్సిందే. ఇవి సైతం పైనుంచి వచ్చిన బృందం కనుసన్నల్లో పనిచేసేలా రూపకల్పన చేశారు. అభ్యర్థులు ఎంతగానో నమ్మే ఏజెంట్లకూ అధికార పక్ష నేతలు ఎరవేస్తున్నారు. ప్రత్యర్థిని దెబ్బ తీయడానికి ఏజెంట్ల వ్యవ స్టను కూల్చడానికి వ్యూహం పన్నుతున్నారు. ప్రత్యర్థికి బూతేజెంట్ లేని పరిస్థితిని కల్పించడానికి నోట్ల కట్టల ఎరచూపుతున్నారు.



సేవకు మరో రూపం నర్సు

నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

రోగులకు వైద్యులు ఇచ్చే ఔషదం ఎంత ముఖ్యమో.. నర్సులు చేసే సేవలూ అంతే ముఖ్యం. సేవకు మరో రూపం నర్సు. అలాంటి నర్సులకు ఆదర్శనీయులు ఫ్లోరెన్స్ నైటింగేల్. యుద్ధం సమయంలో ఆమె చేసిన సేవలతో ఎంతో మంది సైనికుల ప్రాణాలు నిలిచాయి. సేవకు ప్రతిరూపంగా నిలిచింది. ఆమె సేవలకు గుర్తుగా ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదినాన్ని అంతర్జాతీయ నర్సులు దినోత్సవంగా ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. నిజమైన సమాజ సేవకురాలు నర్సు. మే 12 అంతర్జాతీయ నర్సులు దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

రోగులే తమ పిల్లలుగా భావిస్తూ నర్సులు అహోరాత్రులు శ్రమిస్తారు. అటు డాక్టర్లకు, ఇటు రోగులకు వాళ్లు నిత్యం అందుబాటులో ఉండాల్సిందే. ఆసుపత్రుల్లో నర్సులు చేసే పని ఎంతో కీలకమైనది. రోగులకు సేవ అందంచడానికి నర్సులు ఎంతో కృషి చేస్తారు. కానీ వాళ్ల పనిని ఎవరు గమనించరు. కేవలం డాక్టరు చేసే విధులను మాత్రమే చాలా మంది పరిగణనలోనికి తీసుకుంటారు. అందుకే నర్సులను చిన్నచూపు చూస్తారు. కానీ నర్సులకు ఉండే ముఖ్యమైన బాధ్యతల గురించి అందిరికి తెలియదు.

నర్సు అంటే ఎవరు?

సాధారణ రోగి సంరక్షణ, ఆ వ్యక్తికి చికిత్సను అందించే వైద్య నిపుణులనే నర్స్ అంటారు. నర్సులు సాధారణంగా వైద్యులు, ఇతర ఆరోగ్య సంరక్షణ నిపుణుల బృందంతో పని చేస్తారు. నర్సులు అనేక రకాల వాతావరణాల్లో పని చేస్తుంటారు. ఉదాహరణకు ఆసుపత్రులు, క్లినిక్‌లు, డాక్టరు ఆఫీసులు, స్కూళ్లు, అంగన్‌వాడీ సెంటర్లు, అనాధ ఆశ్రమాలు, పునరావాస కేంద్రాలు ఇలా ఎక్కడైనా వ్యాళ్ల తమ పనికి అనుగుణంగా బాధ్యతలను నిర్వహిస్తారు.

నైటేంగిల్ సేవలు

నర్సులకు ఆదర్శనీయులైన ఫ్లోరెన్స్ నైటింగేల్ విల్లియం ఎడ్వర్డ్ షోర్, నైటింగేల్ ఫానీ స్మిత్ దంపతులకు 1812 మే 12న ఇటలీలో పుట్టింది. తల్లి ఫానీ నైటింగేల్ చాలా అందగత్తె. ఫ్లోరెన్స్‌కు ఒక అక్క ఉండేది. తండ్రితో పాటు అక్కచెల్లెళ్లు ఇద్దరు ఊర్లు తిరిగేవారు. ఆ రోజుల్లో ఆసుపత్రులు ఆధ్వాన స్థితిలో ఉండేవి. శుచి, శుభ్రత ఏ మాత్రం ఉండేవి కావు. అయినా ఫ్లోరెన్స్ నర్సింగ్ పని చేసేందుకు నిశ్చయించుకుంది. తల్లి సాహితి ప్రపంచంలో ధృవతారగా ఎదగాలని కోరినా, జర్మనీలో కైజసర్ సంస్థలో పని చేయాలని నిర్ణయించుకుని, ఇద్దరు బిడ్డలను దత్తత తీసుకుని పెంచడం మొదలు పెట్టింది. 1852లో ఐర్లాండ్ వెళ్లింది. అక్కడ ఆసుపత్రులు చూసి వాటిలో విప్లవాత్మక మార్పులు తేవాలనుకుంది. 1853లో సిస్టర్ ఆఫ్ చారిటికి వెళ్లింది. తిరిగి లండన్‌కు వచ్చి తన నానమ్మకు సేవ చేయడానికి వచ్చింది. అక్కడ కలరా వ్యాపించింది. వెంటనే ఆసుపత్రులో రోగులకు పగులనక, రాత్రనక సేవలందించింది. పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చి రోగులకు రుచికరమైన ఆహారం అందించింది. 1854-56లో క్రిమియాలో ఘోర యుద్ధం జరిగింది. ఫ్లారెన్స్ తోటి నర్సులను కూడగట్టుకుని యుద్ధంలో గాయాలైన సైనికులకు నిరూపమైన సేవలందించింది. వారికి ధైర్యం చెప్పింది. సాటి నర్సులు వారిని విసుక్కునేవారు. ఏ పని దొరక్క ఈ పనికి వచ్చాం అనేవారు. కానీ ఎంతో ధనిక కుటుంబంలో నుంచి వచ్చిన ఆమె ఈ పనిని ఎంతో శ్రద్ధతో, ఇష్టంతో చేసేది. ఎంతో గుండె నిబ్బరంతో చిమ్మచీకట్లో కూడా చిరుదీపం వెంట తీసుకుని వెళ్లి సేవలు చేసేది. రోగుల ముఖం మీద చిరునవ్వు ఆమె చేతిలో దీపంలాగా వెలిగేది. మొదట్లో ఆమెను చూసి అదికారులు మండిపడేవారు. ఆమె నిరూపమైన సేవకు తర్వాత ముగ్ధులయ్యారు. ఆసుపత్రులకు చోటు లేకపోతే పాత ఇళ్లు, భవంతులను అధికారుల సహాయంతో ఆసుపత్రులగా మార్చేది. రాత్రుల్లో రెండు మూడు గంటల మాత్రమే పడుకుని మిగిలిన సమయం సేవలకే పరిమితం అయింది. తాను అనారోగ్యంతో ఉన్నా సైనికులకు సేవలు అందించింది. తాగుడుకు డబ్బు ఖర్చు పెట్టకండి, మీ ఇళ్లకు పంపండి వారి భుక్తి గడుస్తుందని సైనికులకు చెప్పేది. గ్రంథాలయాలు చదువుకునే గదులు అందరికి అందుబాటులో ఉండేటట్లు చూసి అక్షరాస్యతను పెంచింది. ఆమె నోట్స్ ఆన్ హాస్పిటల్స్, నోట్స్ ఆన్ నర్సింగ్ అనే గ్రంథాలను కూడా రాసింది. రాయడమే కాకుండా విక్టోరియా రాణికి, ప్రభుత్వ అధికారులకి హాస్పిటల్స్ బాగు చేయాలని అభ్యర్థులను పంపింది. అప్పటి నుంచే నర్సులకు తప్పనిసరిగా శిక్షణ ఇవ్వడం ప్రారంభమైంది. 1860 జూన్ 24న నైటింగేల్ ట్రైనింగ్ స్కూల్ ఫర్ నర్సస్ అనే సంస్థను లండన్‌లో స్థాపించారు. ఆమెను మథర్ ఆఫ్ మోడరన్ నర్సింగ్‌గా గుర్తించారు. భారతదేశానికి కూడా ఆమె ఇతోథిక సేవలందించింది. 1859లో విక్టోరియా రాణి ఆరోగ్య సంస్కరణల కోసం ఒక కమిషన్ నియమించింది. చెన్నయ్ నగరపు మేయరు ఆడ నర్సులకు శిక్షణను ప్రోత్సహించారు. నగర పారిశుద్యం మెరుగుపడింది. ఫ్లారెన్స్ సలహాలతో మన దేశంలో మరణాల రేటు తగ్గింది. 1910 ఆగస్టులో ఫ్లారెన్స్ మరణించింది. సేవా నిరతిగల ప్రతి నర్సులోనూ ఆమె కలకాలం జీవించి ఉంటుంది. నర్సులు, రోగులు గుర్తించుకోవాల్సిన ఆదర్శమూర్తి నైటింగేల్. మళ్లి ఒక ఫ్లారెన్స్ పుట్టి మన ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితి మెరుగు పడాలని కోరుకుందాం.

సేవే జీవితం



నర్సులు. ఈ పేరు తెలియని వారు ఎవ్వరూ ఉండరు. ప్రతి ఆసుపత్రులో రోగికి ముందుగా ఎదురొచ్చేది, నిత్యం రోగితో ఉండేది. ఆరోగ్యంతో తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో చిరునవ్వుతో వీడ్కోలు పలికే వరకు రోగిని అంటుపెట్టుకుని ఉండేది నర్సే. వైద్యులు సలహాలు, సూచనలు క్రమం తప్పకుండా పాటిస్తూ రోగిని సంపూర్ణ ఆరోగ్యవంతులు చేయడంలో నర్సులు పాత్ర కీలకం. సేవే వారి జీవితం. నిస్వార్ధ సేవలందించే నర్సులు రోగులకు ఎప్పటికీ గుర్తుంటారు. అంతర్జాతీయ నర్సులు దినోత్సవం సందర్భంగా నర్సులకు శుభాకాకంక్షలు.

- తిరుమలరెడ్డి ప్రభావతి, అసిస్టెంట్ డైరెక్టర్ (నర్సింగ్), స్విమ్స్

నైటింగేల్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



ఫ్లారెన్స్ నైటింగేల్ 19వ శతాబ్దంలో నర్సింగ్ వ్యవస్థకు గుర్తింపు తీసుకురావడంలో ఎంతో కృషి చేసింది. రాత్రుల్లో లాంతరు వెలుతురులో యుద్ధంలో గాయపడిన సైనికులకు ఎంతో ఉదారస్వభావంతో, అంకితభావంతో సేవలందించి, ఒక గొప్ప నర్సుగా పేరు తెచ్చుకుంది. అందుకే ఆమెను నూతన నర్సింగ్ విధాన రూపకర్తగా అభివర్ణిస్తారు. అటువంటి గొప్ప సేవకురాలిని నేటి నర్సింగ్ అధికారులు, నర్సులు, నర్సింగ్ విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలి.

- పి.అరుణమ్మ, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1, రుయా ఆసుపత్రి

రోగుల సేవలో నర్సులు పాత్ర కీలకం



అనారోగ్యంతో ఆసుపత్రి పాలైన రోగులకు సేవలందించడంలో నర్సుల పాత్ర చాలా కీలకం. ఆసుపత్రిలో చేరినప్పటి నుంచి తిరిగి ఆరోగ్యవంతులుగా ఇంటికి వెళ్లే వరకు 24 గంటలు రోగిని అంటి పెట్టుకుని సేవలందిస్తారు. ఫ్లారెన్స్ నైటింగేల వంటి ఎంతో మంది ఆదర్శవంతులను స్ఫూర్తిగా తీసుకుని, నర్సులు నిస్వార్ధసేవలు అందిస్తారు. నిజమైన నిస్వార్ధసేవకులైన నర్సులకు అంతర్జాతీయ నర్సుల దినోత్సవ శుభాకాంక్షలు.

- పి.సుధారాణి, ప్రిన్సిపాల్, స్విమ్స్ నర్సింగ్ కళాశాల

పల్లె ప్రగతికి కృషి చేస్తాం: దగ్గుమళ్ళ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: పల్లె ప్రాంతాలు బాగుపడాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని, ఈ నేపథ్యంలో ఎన్డీఏ కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని చిత్తూరు పార్లమెంటు అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు వరిగపల్లి ప్రజలను అభ్యర్థించారు. యాదమరి మండలం, వరిగపల్లెలో నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఆయన చిత్తూరు పార్లమెంటు అధ్యక్షులు సిఆర్ రాజన్‌తో కలిసి పాల్గొన్నారు. వారు ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించిన కరపత్రాలు పంచుతూ ఓటర్లను అభ్యర్థించారు. అక్కడి ప్రజలు పలు సమస్యలను దగ్గుమళ్ళ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన టిడిపి ఎంపీ అభ్యర్థి ప్రసాద్ రావు తాను గెలిచిన వెంటనే వరిగ పల్లెను పట్టిపీడిస్తున్న నీటి సమస్యను పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. గ్రామీణ ప్రజలంతా పని చేసే వారికి



పట్టం కట్టాలని ఆయన కోరారు. సమర్థమంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని బతికించినట్టవుతుందని తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలు పూర్తిగా కాలరాయపడ్డాయని, ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తమ గోడును ఎవరికి చెప్పుకోలో తెలియక తికమక పడుతున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలు ప్రగతి పథం వైపు అడుగులు వేయాలంటే.. చంద్రబాబు సీఎం కావాలని.. ఆయన నాయకత్వంలో పనిచేసే తనను కూడా గెలిపించాలని దగ్గుమళ్ళ ప్రసాదరావు గ్రామీణ ప్రాంత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తాను గెలిచిన వెంటనే చిత్తూరు పార్లమెంట్ సర్వతోముకాభివద్ధే తన సంకల్పంగా ఎంచుకొని, చిత్తశుద్ధితో పని చేయనున్నట్లు తెలిపారు.

ప్రశాంత పోలింగ్‌కు రాజకీయ పార్టీలు సహకరించాలి: జిల్లా ఎస్పీ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు రాజకీయ పార్టీ అభ్యర్థులు సహకరించాలని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు కోరారు. ఓటర్లు తమ ఓటు హక్కును ఎలాంటి ఇబ్బంది లేదా అడ్డంకి లేకుండా పూర్తి స్వేచ్ఛతో వినియోగించుకోవటానికీ, ప్రశాంతంగా పోలింగ్ జరగటానికీ ఎన్నికల డ్యుటీలో ఉన్న అధికారులకు సహకరించాలన్నారు. తమ కార్యకర్తలకు తగిన బ్యాడ్జీలు లేదా గుర్తింపు కార్డులను ఇవ్వాలన్నారు. ఓటర్లకిచ్చే గుర్తింపు స్లిప్పు తెల్లకాగితాలుగా ఉండాలి తప్ప, వాటి మీద ఏ చిహ్నం, అభ్యర్థి పేరు లేదా పార్టీ పేరూ ఉండకుండా చూసుకోవాలన్నారు. అభ్యర్థి, పార్టీల కార్యకర్తలు, సానుభూతిపరుల మధ్య కొట్లాటలు, ఆవేశోద్వేగాలను



ఎస్పీ మణికంఠ

పరహరించే దిశగా రాజకీయ పక్షాలు, అభ్యర్థులు పోలింగు బూత్ల ముందు, తాము నిర్వహించే శిబిరాల దగ్గర అనవసరంగా జనం గుమికూడకుండా చూసుకోవాలన్నారు. అభ్యర్థి తన శిబిరం చాలా నిరాడంబరంగా ఉండేట్లు చూసుకోవాలని సూచించారు. వారు ఎలాంటి పోస్టర్లు, జెండాలు, చిహ్నాలు లేదా మరెలాంటి ప్రచార వస్తువులను ప్రదర్శించరాదన్నారు. తిండి పదార్థాలను శిబిరాల వద్ద అందించకూడదని స్పష్టం చేశారు. పోలింగు రోజున తాము నడిపించే వాహనాలపై విధించిన నిబంధనలకు కట్టుబడి ఉండేటట్లు అధికారులకు సహకరించాలి, వాటికోసం అనుమతులు పొందాలన్నారు. ఆ అనుమతులను స్పష్టంగా కనబడేటట్లు వాహనాలపై ప్రదర్శించాలన్నారు.